



పట్టా తీసుకునే సమయంలో ప్రమాణం చేస్తున్న నూతన గ్రాడ్యుయేట్లు

వైద్యసేవల్లో అంకితమవుతాం!

- నూతన గ్రాడ్యుయేట్ల ప్రమాణం
- ఉత్సాహంగా ప్రభుత్వ వైద్యకళాశాల గ్రాడ్యుయేషన్ డే
- 177మంది వైద్యులకు పట్టాల పంపిణీ
- నెల్లూరు మెడికల్ కాలేజీకి మంచి పేరు తేవాలి
- పీజీకి సన్నద్ధం కావాలని వక్తల పిలుపు

'వృత్తి పట్ల నీతి, నిజాయితీ, నిబద్ధతతో పని చేస్తాం. వైద్యవృత్తిలో కొత్త పరిజ్ఞానాన్ని నేర్చుకుంటాం. తల్లిదండ్రుల ఆశయాల మేరకు బాధ్యతగా మెలగతాము. మానవతా విలువలు పాటించి రోగులకు అందించే వైద్యసేవల్లో అంకిత భావంతో పని చేస్తాం.' అంటూ నూతన వైద్య గ్రాడ్యుయేట్లు ప్రమాణం చేశారు. సోమవారం రాత్రి నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే ఉత్సాహంగా జరిగింది. 2019-25 బ్యాచ్ వంద శాతం ఫలితాలు సాధించగా, 177 మంది వైద్యులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల (పీజీ) వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర మాట్లాడుతూ తాజా గ్రాడ్యుయేట్లు సమాజంలో మంచి పేరు తెచ్చుకునేలా వైద్య చికిత్సలు అందించాలని కోరారు. ఈ పోటీ ప్రపంచంలో గ్రాడ్యుయేషన్‌తోనే ఆపకుండా పీజీ చేసినప్పుడే గౌరవం ఉంటుందని చెప్పారు. జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వైద్యులు టీ-20 క్రికెట్ మ్యాచుల్లా పరుగులు తీయాల్సి ఉంటుందని చెప్పారు. నీట్ పరీక్షలో పీజీ సీటు కొట్టేలా రేపటి నుంచే సన్నద్ధం కావాలని సూచించారు. మరో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కాలేషాబాషా మాట్లాడుతూ ప్రస్తుతం ఎంబీబీఎస్‌తోనే ప్రాక్టీస్ చేయాలంటే నెలకు కేవలం రూ.35 వేలు మాత్రమే వస్తాయని, అలా కాకుండా పీజీ పూర్తి చేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. వైద్య కళాశాల, జీజీహెచ్ డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ సమాజంలో వైద్యులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని, దాన్ని దృష్టిలో పెట్టుకుని వైద్యులు మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైక్రోబయాలజీ హెచ్‌వోడీ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైద్యులు విజిత, రాజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి)





కుటుంబంతో కలిసి పట్టా అందుకుంటున్న ఓ విద్యార్థిని

సీఐడీకి 'మాగుంట' కేసు!

- సర్వేపల్లి రిజర్వాయర్‌లో అక్రమంగా గ్రావెల్ తరలింపు
- నాడు రూ.కోట్లు కొల్లగొట్టిన వైసీపీ నేతలు
- భోక్తల పనిపట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు
- కేసును సీఐడీకి అప్పగిస్తూ కీలక నిర్ణయం

నెల్లూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : నాడు సర్వేపల్లి రిజర్వాయర్‌లో జరిగిన గ్రావెల్ దోపిడీని నిగ్గు తేల్చేందుకు కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వెంకటాచలం పోలీసుస్టేషన్‌లో నమోదైన గ్రావెల్ కేసును సీఐడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ హయాంలో 2021లో అక్రమార్కులు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఆయన పేరుతో వారి పొలానికి గ్రావెల్ అవసరమన్నట్లు దరఖాస్తు చేసి అనుమతులు పొందారు. లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను లేఅవుట్లకు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. నాటి ప్రతిపక్ష టీడీపీ ఆందోళనలతో విచారణ జరిపిన ఇరిగేషన్ అధికారులు.. 'సర్వేపల్లి'లో అనుమతులకు మించి తవ్వకాలు జరిపింది వాస్తవమని తేల్చారు. అందుకు బాధ్యులపై వెంకటాచలం స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. దీంతో తూపిలి ఉదయ్ కుమార్‌రెడ్డి, ఎం.శ్రీనివాసులురెడ్డి, బి శ్రీధర్‌రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. తీరా దర్యాప్తులోకి వచ్చే సరికి ఎంపీ పేరుతో కూడా అనుమతులు పొందినట్లు తేలింది. దీనిపైపై ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అయితే ఈ వ్యవహారం ఎక్కడ వైసీపీ పెద్దల మెడకు చుట్టుకుంటోందనన్న భయంతో ఈ కేసును పక్కనపడేశారు.



సర్వేపల్లి రిజర్వాయర్‌లో గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన గుంతలు (ఫైల్)

సీఎంవో ఆదేశాలతో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్వేపల్లి, కనుపూరు చెరువుల్లో అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ఎమ్మెల్యే సోమిరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. గత నవంబరులో ఈ గ్రావెల్ అక్రమ తవ్వకాలకు సంబంధించి నివేదిక ఇవ్వాలంటూ ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి ఇరిగేషన్ ఉన్నతాధికారులకు ఆదేశాలు అందాయి. జిల్లాలో జరిగిన వ్యవహారాలన్నీ ఇరిగేషన్ అధికారులు సీఎంవోకు నివేదిక రూపంలో అందించారు. అలానే పోలీసులు కూడా గ్రావెల్ కేసు వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేశారు. వీటన్నిటినీ పరిశీలించిన ప్రభుత్వం గ్రావెల్ అక్రమార్కులపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమైంది. గ్రావెల్ అక్రమ తవ్వకాల కన్నా ఒక ఎంపీ సంతకాన్ని ఫోర్జరీ చేయడాన్ని సీరియస్‌గా పరిగణించిన ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి అప్పగిస్తూ ఉత్వర్వులు జారీ చేసింది. నెల్లూరులోని సీఐడీ విభాగానికి కాకుండా రాష్ట్ర స్థాయిలోని ఒక ప్రత్యేక బృందానికి ఈ కేసును అప్పగించినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. ఇటీవల ఈ బృందం నెల్లూరులోని ఇరిగేషన్ కార్యాలయంలో అధికారుల స్టేట్‌మెంట్లు రికార్డు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం దర్యాప్తు వేగంగా జరుగుతోందని, త్వరలోనే సంచలనాలు వెలుగుచూసే అవకాశాలు ఉన్నట్లు పోలీసు వర్గాల గుసగుసలాడుకుంటున్నాయి.

విద్యాశాఖ వెబ్‌సైట్‌లో టీచర్ల సీనియారిటీ జాబితా

నెల్లూరు (విద్య), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపాలిటీలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాలను ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ ఆధారంగా రూపొందించి విద్యాశాఖ వెబ్‌సైట్, కార్యాలయ నోటీస్‌బోర్డుల్లో అందుబాటులో ఉంచామని డీఈఓ ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 10వతేదీ లోపు జిల్లా విద్యాశాఖ, గుంటూరు ఆర్‌జేడీ కార్యాలయానికి పూర్తి స్థాయి వివరాలను సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

స్కూల్ లాగిన్స్‌లో టెన్త్ హాల్‌టికెట్లు

టెన్త్ పరీక్షల హాల్‌టికెట్లను సోమవారం నుంచి పాఠశాలల లాగిన్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈఓ తెలిపారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు వారి ఫోన్ నుంచి హాయ్ అనే మెసేజ్‌ను 9552300009 నెంబర్‌కు పంపి సేవను ఎంచుకోండి అనే ఆప్షన్ ద్వారా విద్యాసేవలు సెలక్ట్ చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థి అప్లికేషన్ నెంబర్, చైల్డ్ ఐడీ, పుట్టినతేదీ వివరాలు నమోదు చేస్తే హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

ధాన్యం అమ్మిన రైతులకు 24 గంటల్లో నగదు జమ

నెల్లూరు (హరనాథపురం), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు 24గంటల్లో వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతోంది. ఇటీవల సంగం మండలంలో పర్యటించిన రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, ఆనం రామనారాయణ రెడ్డి రైతులకు 24గంటలకంటే ముందుగానే ధాన్యం డబ్బులు చెల్లిస్తామని ప్రకటించారు. సంగం ప్రాథమిక వ్యవసాయ కోపరేటివ్ సొసైటీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు కంఠాబత్తిన శ్రీహరిరెడ్డి, కంఠాబత్తిన వినోద్‌రెడ్డి ఈ నెల 1వ తేదీన 258 బస్తాల బీపీటీ రకం ధాన్యాన్ని పుట్టి రూ.19,770 వంతున విక్రయించారు. విక్రయించిన 24 గంటల్లోనే అంటే 3వ తేదీన (2వ తేదీన ఆదివారం సెలవు) రూ.1,25,280లను రాష్ట్ర పౌరసర ఫరాల సంస్థ చెల్లించింది. ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే తమకు ప్రభుత్వం నగదు జమ చేయడం పట్ల ఆ రైతులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, కలెక్టర్ ఆనంద్ సూచనల మేరకు జేసీ కార్తీక్ జిల్లాలో ముమ్మరంగా పర్యటిస్తూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 298 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నిరంతరం వీటిని పర్యవేక్షిస్తున్నారు.

సీనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- తొలిరోజున 23,905 మంది హాజరు



కావలి : పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల సందడి



నెల్లూరు : పరీక్షల అనంతరం ఎండలో నిలబడి ఉన్న విద్యార్థులు

నెల్లూరు (విద్య), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 79 కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రత నడుమ తొలిరోజు ద్వితీయభాష (తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ) పరీక్షను ప్రశాంతంగా నిర్వహించా రు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను అనుమతించ లేదు. ఆయా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి రాష్ట్ర కార్యాలయంతోపాటు జిల్లాకేంద్రంలోని ఆర్‌ఐఓ కార్యాలయం ద్వారా ప్రత్యక్షంగా పరీక్షలు జరుగుతున్న తీరును అధికారులు పరిశీలించారు. తల్లిదండ్రులతో కలిసి పరీక్ష కేంద్రాల వద్దకు గంట ముందుగానే విద్యార్థులు చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. తొలిరోజున జనరల్ విద్యార్థులు 23,396 మందికిగాను 22,950 మంది హాజరవగా, 446 మంది గైర్హాజరు అయ్యారు. అలాగే ఒకేషనల్‌కు 1002 మందికి 47 మంది గైర్హాజరవగా 955 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌ఐఓ ఎ.శ్రీనివాసులు పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచిన ప్రశ్నపత్రాలను పరిశీలించిన అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయనతోపాటు డీవీఈఓ, డీఈసీ సభ్యులు, ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని, పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు తెలిపారు.

7 నుంచి మూల్యాంకనం

ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి సంస్కృతం జవాబుపత్రాల మూల్యాంకనాన్ని ఈ నెల 7వతేదీన ప్రారంభిస్తున్నట్లు ఆర్‌ఐఓ శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని కేవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి మూల్యాంకనం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల కింద నడుస్తున్న జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు సంబంధిత సంస్కృత లెక్చరర్లను రిలీవ్ చేసి 7వ తేదీన స్పాట్ వాల్యూయేషన్‌కు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

- ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్‌స్కూల్) ఇంటర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 20 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరిగిన తొలిరోజు పరీక్షకు 3,179 మందికి 2,871 మంది హాజరైనట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు తెలిపారు. తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని తెలిపారు.



వెంకటాచలంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసు కానిస్టేబుల్

సచివాలయ ఏఎన్ఎంలకు పదోన్నతులు

- 249 మందికి అవకాశం
- ఇప్పటికే జాబితా సిద్ధం.. అభ్యంతరాల స్వీకరణ
- కలెక్టర్ అనుమతి పొందాక తుది జాబితా

నెల్లూరు (వైద్యం), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : సచివాలయాల్లో ఏఎన్ఎంలకు పదోన్నతులు లభించనున్నాయి. ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ విజయానంద్ ఏఎన్ఎంల పదోన్నతుల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. గత ఏడాది డిసెంబరులోనే ఏఎన్ఎంల వివరాలు సేకరించగా, మెరిట్ జాబితా తయారు చేసి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియచేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఏఎన్ఎంలకు ఆ జాబితాను అందుబాటులో ఉంచారు. వారి నుంచి అభ్యంతరాలు స్వీకరించి డీఎంహెచ్‌వో సుజాతతోపాటు జడ్పీ సీఈవో విద్యారమ, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్ కుమార్‌ల కమిటీ ఏఎన్ఎంల పదోన్నతిపై నిర్ణయం తీసుకుంటారు. చివరగా కలెక్టర్ ఆనంద్ నుంచి అనుమతులు పొందాక పదోన్నతుల జాబితా ప్రకటించనున్నారు.



249 మందికి పదోన్నతి

జిల్లావ్యాప్తంగా 813 సచివాలయాల్లో 813 మంది ఏఎన్ఎంలు పని చేస్తున్నారు. రిజర్వేషన్ల ప్రాతిపదికన, మెరిట్ జాబితా ప్రకారం 249 మందికి పదోన్నతులు లభించనున్నాయి. గ్రేడ్-3లో ఏఎన్ఎంలు గ్రేడ్-1 పదోన్నతి లభిస్తుంది. అలాగే ఒక్కో ఏఎన్ఎంకు రూ.32 వేల వేతనం అందుతుండగా, పదోన్నతి లభిస్తే రూ.7 వేలు పెరిగే అవకాశం ఉంటుంది.



అందరి అభిప్రాయాలు తీసుకుంటాం

సచివాలయ ఏఎన్ఎంలకు పదోన్నతుల జాబితా రూపొందించాం. ఇందులో ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా లేదా అన్న వివరాలు కూడా సేకరిస్తున్నాం. అన్ని రకాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని తుది జాబితా రూపొందిస్తాం. రిజర్వేషన్ ప్రాతిపదికన ఈ పదోన్నతులు ఉంటాయి.

- సుజాత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

సంచార పశువైద్య సేవలకు బ్రేక్!

- జేడీ కార్యాలయ ఆవరణలో 9 అంబులెన్సులు
- మిగిలిన పది వాహనాలూ వెనక్కి?
- ఏజెన్సీకి ముగిసిన గడువు
- పాడిరైతుల్లో ఆందోళన

నెల్లూరు (వ్యవసాయం), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పాడి పశువులకు అందుతున్న సంచార పశువైద్యసేవలు ప్రశ్నార్థకంగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ బాధ్యతలు చేపట్టిన ఏజెన్సీ గడువు ముగిసిపోవడమే ఇందుకు కారణం. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 9 సంచార పశువైద్య అంబులెన్సులకు బ్రేకులు పడగా, మిగిలిన వాహనాల ఎప్పుడు నిలిచిపోతాయోనన్న ఆందోళన పాడిరైతుల్లో నెలకొంది.

నిలిచిన 9 సంచార పశు అంబులెన్సులు

గ్రామీణ ప్రాంతాల్లో పశువులు అనారోగ్యానికి గురైతే నేరుగా ఇంటి వద్దకే వచ్చి పశువైద్యం అందించేందుకు గత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సహకారంతో సంచార పశువైద్య అంబులెన్సులు అందుబాటులోకి తెచ్చింది. 2021లో మొదటి విడతగా 9 అంబులెన్సులు, రెండో విడతగా 10 వాహనాలు ఉమ్మడి జిల్లాకు కేటాయించారు. వైద్యుడు, ఫార్మసిస్టులు, టెక్నీషియన్, పైలట్‌తోసహా నలుగురు సిబ్బంది పాడిరైతులకు సేవలందించేలా ప్రణాళికలు రూపొందించారు. 1962 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేస్తే చాలు అంబులెన్సులు నేరుగా వారి ఇంటి వద్దకు వెళ్లి సేవలందిస్తాయి. రాష్ట్రవ్యాప్తంగా వీటి నిర్వహణను జీవీకే ఫౌండేషన్‌కు అప్పగించారు. అయితే గత నెలతో నిర్వహణ కాలవ్యవధి పూర్తయింది.



జేడీ కార్యాలయ ఆవరణలో సంచార పశు వైద్య అంబులెన్సులు

1వ తేదీ నుంచి నిలిచిన సేవలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సేవలందిస్తున్న సంచార పశు అంబులెన్సుల సేవలు మార్చి 1వతేదీ నుంచి నిలిచిపోయాయి. మొదటి విడతగా జిల్లాకు వచ్చిన 9 వాహనాలను డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉంచారు. వాహనాల ఫిట్‌నెస్‌ను పూర్తి స్థాయిలో పరిశీలించాలని ప్రభుత్వం నుంచి పశుసంవర్ధక శాఖకు అందాయి. ఆ తర్వాతే వాటిని ప్రభుత్వానికి అందజేయనున్నారు. అయితే రెండో విడతలో మంజూరైన 10 అంబులెన్సు సేవలు మాత్రం యథావిధిగా కొనసాగుతున్నాయి. ఈ సేవలు కూడా ఎక్కడ నిలిచిపోతాయోనని పాడిరైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించనున్నారని, అందువల్లే సేవల్లో జాప్యం నెలకొందని కొందరు అధికారులు చెబుతున్నారు.



ప్రభుత్వ ఆదేశాల మేరకే..

ప్రభుత్వ ఆదేశాల మేరకే సంచార పశు వైద్య అంబులెన్సులు నిలిచాయి. మొదటి విడతలో మంజూరైన 9 వాహనాల ఫిట్‌నెస్‌లను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇప్పటికే డిప్యూటీ డైరెక్టర్లు పరిశీలిస్తున్నారు. అంబులెన్సుల నిర్వహణ ఏజెన్సీ కాలపరిమితి పూర్తవడంతో ప్రస్తుతం వాహనాలు నిలిచాయి.

- రమేష్‌నాయక్, పశుసంవర్ధక శాఖ జేడీ

కుంటుపడుతున్న అభివృద్ధి

- టీడీపీ, వైసీపీ నేతల పరస్పర ఫిర్యాదులతో వేడెక్కిన రాజకీయం
- అభివృద్ధి పనులకు తీర్మానాలు ఇవ్వని ఎంపీపీ

లింగసముద్రం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీపీ, వైసీపీ నేతలు జిల్లా ఉన్నతాధికారులకు పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడంతో రాజకీ యం వేడెక్కింది. గత నెల 23న లింగసముద్రం ఎం పీడీఓ కార్యాలయంలో జరిగిన పరిణామాలతో ఇరు పార్టీల నేతలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకు న్నారు. అయితే కూటమి ప్రభుత్వ కొలువుదీరిన నాలుగైదు నెలల కిందట మండలంలో రూ.3కోట్ల ఉపాధి నిధులతో పలు గ్రామాల్లో టీడీపీ నేతలు సీసీ రోడ్లను నిర్మించారు. అయితే అప్పట్లో ఈ పనులకు ఎంపీపీ తీర్మానాలను ఇవ్వడంతో ఈ పనులు సాఫీగా జరిగాయి. ఈ పనులను ప్రారంభించే ముందు టీడీపీ నేతలకు ఎంపీపీ మధ్య ఒప్పందం కుదిరినట్టుగా ప్రచారం జరుగుతోంది. తమ పార్టీ వారు చేసిన పనుల బిల్లులు సుమారు రూ.22లక్షలు ఒకేసారి ఇస్తామని చెప్పడం వలన సీసీ నిర్మాణాలకు తీర్మానాలు ఇచ్చినట్టు ఎంపీపీ చెబుతున్నారు. అయితే తాము అలా చెప్పలే దని, వైసీపీ వారికి రావాల్సిన బిల్లులు రెండు విడతలుగా ఇచ్చేందుకు అంగీకరించామని టీడీపీ నాయకులు చెబుతున్నారు.

ప్రస్తుతం నిధుల వివరాలు ఇలా..

మండల నిధులు రూ.40 లక్షల వరకు ఉన్నాయని అం దులో రూ.11 లక్షలు వైసీపీ వారికి ఇచ్చి, మిగిలిన నిధులతో టీడీపీ వారు పనులు చేస్తారని, మరో విడత వచ్చే నిధు లలో మిగిలిన రూ.11లక్షలు వైసీపీ వారికి ఇస్తామని చెప్పినా వారు అంగీకరించ లేదని టీడీపీ నేతలు చెబు తున్నారు. తమకు బిల్లులు ఇవ్వక పోతే కోర్టుకు వెళ్లి తెచ్చుకుంటామని వైసీపీ నేతలు చర్చిం చుకుంటున్నారు. దీంతో మండలంలో పనులు చేసే విషయంలో ప్రతిష్టంభన నెలకొంది.

రెండు నెలలుగా ఇదే సమస్య..

రెండునెలలుగా నెలకొన్న ఈ సమస్యతో మండలంలో పలు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. అలాగే మండ లానికి మంజూరైన రెండు సీసీరోడ్ల నిర్మాణం నిధులు రూ.40లక్షలు మరో మండలానికి ఉ న్నతాధికారులు కేటా యించినట్టు అధికారులు తెలి పారు.



లింగసముద్రం ఎంపీడీవో కార్యాలయం

అలాగే మండలానికి 25 గోకులం షెడ్లు మం జూరయ్యాయి. ఇవి ఒక్కొక్కటి రూ.2.50 లక్షలతో ని ర్మించాల్సి ఉంది. అలాగే 1000 సోక్ పిట్లు మంజూ రవగా ఒక్కొక్కటి రూ.6వేలతో నిర్మించాలి. అలాగే పెదపవని, చినపవనిలో సీసీ నిర్మాణానికి రూ.20 లక్షలు చొప్పున మొత్తం రూ.40లక్షలు మంజూర య్యాయి. ఆ నిధులు కూడా ఉన్నతాధికారులు మరో మండలానికి కేటాయించారు. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మండలానికి వచ్చే నిధులు రాకుండా పోయే ప్రమాదం ఉందని సర్వత్రా ఆందోళన వ్యక్తమౌతోంది.

మోడల్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

లింగసముద్రం, మార్చి 3(ఆంధ్ర జ్యోతి) తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సోమవారం ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హష్రార్ తెలిపారు. విద్యార్థులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో లేదా స్కూల్ వద్దకు వచ్చి దరఖాస్తు అందజేయవచ్చని పేర్కొన్నారు.

చెత్తను సంపదగా మార్చుకుందాం

బిట్రగుంట, మార్చి,3(ఆంధ్రజ్యోతి): చెత్తను సంపదగా మార్చుకోవడానికి అవసరమైన వనరులన్నింటినీ వినియోగించడంపై గ్రీన్‌గార్డ్స్, గ్రీన్ అంబాసి డర్స్‌కు పంచాయతీ కార్యదర్శి షేక్ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతి ఇంటినుండి తడి, పొడ చెత్తలను వేరువేరుగా సేకరించి వర్మీకంపోస్టు తయారీపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

ఉదయగిరి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్ పనుల నిమిత్తం రూ.లక్ష చెక్కును సోమవారం ఎంఈవో-2 తోట శ్రీనివాసులు ప్రధానోపాధ్యాయుడు బాలకేశవులుకు అందజేశారు. కుర్రపల్లి మెయిన్ పాఠశాలలో మిగులు నిధులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెక్ రూపంలో అందజేశామన్నారు.

నిత్యావసరాల వితరణ

సంగం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అనసూయనగర్‌లోని తాండ్ర లక్ష్మయ్య కుటుంబానికి సోమవారం జనసేన నాయకులు దాడి భాను కిరణ్, చదలవాడ హరీష్ సహకారంతో నెలరోజులకు సరిపడ నిత్యవసర సరుకులు అందజేశారు. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్ఫూర్తితో ప్రతినెలా కార్య క్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి వినతి

కందుకూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 9వ వార్డు పరిధిలోని కోటారెడ్డినగర్‌లో సిమెంటురోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయ కులు సోమవారం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఓవీ రోడ్డులోని అంకమ్మతల్లి పెట్రోలు బంకు నుంచి క్లబ్ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న ప్రధాన రహదారిని సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేయాలని కొన్నేళ్లుగా ఈ ప్రాంతవాసులు విజ్ఞప్తులు చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కలిగిరి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణించాలని సీడీపీఓ సీహెచ్ పద్మజాకుమారి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జడ్పీ హైస్కూల్‌లో సోమవారం మహిళాదినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సాయిలక్ష్మి, ఉపాధ్యాయిని సుగుణమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు విజయలక్ష్మి, హైమవతి పాల్గొన్నారు.

కావలి పీజీ కేంద్రంలో నేడు జాబ్‌మేళా

కావలిటౌన్, మార్చి3(ఆంధ్రజ్యోతి)కావలి పట్టణంలోని వీఎస్‌యు పీజీ కళాశాలలో ఏపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడాప్‌ల సంయుక్తంగా 4వ తేది జాబ్ మేళ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9గంటలనుంచి 2గంటల వరకు జాబ్ మేళ జరుగుతుందని మెడ్‌ప్లస్, రిలయన్స్ రిటైల్ లిమిటెడ్, కాల్మన్ సర్వీసెస్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియేగం చేసుకోవాలని కోరారు.

ఇంటర్ పరీక్షకు ముగ్గురు గైర్హాజరు

కొండాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు ముగ్గురు గైర్హాజరయినట్లు పరీక్షల ముఖ్య నిర్వాహణాధికారి శ్రీహరి తెలిపారు.

చెత్తను ఆదాయ వనరుగా మార్చాలి

కావలి రూరల్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపదను తయారు చేసి పంచాయతీలకు ఆదాయవనరుగా మార్చాలని ఎమ్పీడీవో శ్రీదేవి తెలిపారు. మండలంలోని మన్నంగిదిన్నెలో చెత్త సంపద తయారీ కేంద్రంలో సోమవారం వలేటివారిపాలెం పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వలేటివారిపాలెం ఎమ్పీడీవో నరేంద్రదేవ్, ఈవోపీఆర్డీ సమద్, కార్యదర్శి గీత ఉన్నారు.

స్పందించిన అధికారులు



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

కావలి రూరల్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముసునూరులో దర్జాగా కబ్జాలంటూ సోమవారం ఆంధ్రజ్యో తిలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. కథనాన్ని చూసిన అట్టల ఫ్యాక్టరీ స మీపవాసులు తమ ప్రాంతంలో జరు గుతున్న ఆక్రమణలపై తహసీల్దారు శ్రావణ్ కుమార్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ ప్రాంతంలో ప్ర భుత్వ స్థలాలు, రోడ్ల ఆక్రమణలకు గు రౌతున్నట్లు తహసీల్దారు దృష్టికి తీసు కువెళ్లారు. ఆక్రమణ కట్టడాలు ఆ పాలని, రికార్డులు పరిశీలించాలని రెవె న్యూ ఇన్‌స్పెక్టర్ మోహన్‌ను ఆదేశించారు.

దోమల నివారణకు ఫాగింగ్

కావలి, మార్చి3 (ఆంధ్రజ్యోతి): 7వ వార్డులో సోమవారం మున్సిపల్ కార్మికులు ఫాగింగ్ మిషన్ ద్వారా పొగ వదిలారు. గత కొద్ది రోజులుగా అన్ని వార్డులలో దోమలు తగ్గకపోవడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు.

అంగన్‌వాడీల ఆందోళన

కందుకూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ హెల్పర్స్ యూనియన్ నేతలు బి.వరలక్ష్మి, కె.శైలజ, కమతం అనూరాధ, సుమలు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కా ర్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం సీఐ టీయూ జిల్లా కార్యదర్శి జీ. వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్‌లతో కలిసి కందుకూరు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజను కలిసి తమ దుస్థితిని వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 10న ఛలో విజయవాడ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్కే షాహినా, లోకేశ్వరిలు ఉన్నారు.

ఆశావర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలి తొలగింపు

వింజమూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు అరుణను తొలగించినట్లు సీఐటీయూ మండల కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె సీఐటీయూ ఆశా వర్కర్స్ యూనియన్‌పై అవగాహన లేకుండా బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నందున మండల కమిటీ క్రమశిక్షణ చర్యలు తీసుకుని ఆమె ప్రాథమిక సభ్యతరాన్ని రద్దు చేసినట్లు సీఐటీయూ గౌరవాధ్యక్షులు జి.కామక్షయ్య, అధ్యక్షులు తిరుమలయ్య, భాస్కర్‌రెడ్డి తెలిపారు.

కూరగాయల విక్రయం

వింజమూరులోని తహసీల్దారు కార్యాలయంలో వద్ద సోమవారం వింజమూరు డివిజన్ రైతు సాధికర సంస్థ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఘన ద్రవ జీవామృతం కాషాయాలలో పండించిన కూరగాయలను, ఆకుకూరలను విక్రయించింది. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్‌లు ఎంపీ అంజన్‌రెడ్డి, ఎల్ -1 వెంకట్రావు, ఎల్-2మహేంద్ర, ఐసీపీఆర్‌ఓలు స్వప్న, కళ, అరుణకుమారి, అనూష, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పరిష్కార వేదికకు అధికారులు డుమ్మా

వింజమూరు : సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు మండల అధికారులు డుమ్మా కొట్టారు. మండలంలో దాదాపుగా 12 శాఖల అధికారులకు నాలుగు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పొగాకు బోర్డు ఈడీకి సత్కారం

కందుకూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పొగాకు వేలం కేంద్రాల పరిధిలోని రైతులు, బోర్డు అధికారులు సోమవారం బదిలీపై వెళుతున్న పొగాకుబోర్డు ఈడీ శ్రీధర్‌బాబును సత్కరించి వీడ్కోలు పలికారు. పొగాకు ఎగుమతులు పెరిగేలా.. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ఆయన చేసిన కృషి మరువలేనిది అన్నారు. పరిమితికి మించి పండించిన పొగాకు అమ్ముకునేందుకు రైతులు చెల్లిస్తున్న అపరాధ రుసుంను రద్దు చేయించి లబ్ధి చేకూరేలా చేశారన్నారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు ఆర్‌ఎం ఎం. లక్ష్మణరావు, బోర్డు అధికారులు కేవీ రామాంజనేయులు, ఎం.కిరణ్, బి.చంద్రశేఖర్, శివకుమార్, రాజగోపాల్, రైతు ప్రతినిధులు తాటికొండ రమణయ్య, గుండాల కొండారెడ్డి, వడ్లమూడి రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్‌వో ప్లాంట్‌ను పునరుద్ధరించాలని వినతి

కందుకూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం మండలం నలదలపూరు కాలనీలో మూలనపడిన ఆర్‌వో ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని సోమవారం సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజకు గ్రీవెన్స్‌లో సీఐ టీయూ, వ్యవసాయ కార్మికసంఘాల నాయకులు జీవీబీ కుమార్, దువ్వూరి జాన్‌లు వినతిపత్రం అందజేశారు. ఈ ప్లాంట్ నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నిషేధం

- వ్యాపారులకు నోటీసులు

కావలి, మార్చి3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని అన్ని హోల్‌సేల్ దుకాణాలు, రైతుబజారు ఎస్టేట్ ఆఫీసరు, రైతు బజారు వ్యాపారుల సంఘం అధ్యక్షులకు నోటీస్‌లు జారీ చేశారు. మున్సిపల్ సిబ్బంది రాకను గమనించిన కొందరు హోల్‌సేల్ ప్లాస్టిక్ వ్యాపారులు కొందరు తమ దుకాణాలను మూసి వేసుకుని వెళ్లటంతో దుకాణాల గోడలమీద నోటీసులు అంటించి వాట్సాప్‌లో ఆ దుకాణం నిర్వహకుడికి నోటీస్ పంపి ఫోన్ చేసి చెప్పినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తోందని వారు తెలిపారు.

మాకు నివాస స్థలాలు చూపించండి

- తహసీల్దారుకు గిరిజనుల వినతి



వినతిపత్రం ఇస్తున్న నార్సు మోపూరు ప్రజలు

అల్లూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో తమకు పట్టాలు మంజూరు చేసి ఇప్పటికీ నివాస స్థలాలు చూపించలేదని నార్సుమోపూరు ప్రగతి నగర్ కాలనీకి చెందిన గిరిజనులు సోమవారం తహసీల్దారును కలిసి వినతిపత్రం అందజేశారు. ఇళ్లులేని నిరు పేదలమైన తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారని కానీ నివాస స్థలాలు చూపించకుండా కాలయాపన చేశారని నేటికీ తమ ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియదని వాపోయారు. తమకు ఇచ్చిన పట్టాల ఆధారంగా స్థలాలను చూపించాలని కోరారు. కార్యక్రమంలో పరశురామయ్య, గిరిజన మహిళలు పాల్గొన్నారు.

టార్గెట్‌బాల్ పోటీల్లో కొత్తసత్రం బాలికల ప్రతిభ

కావలి టౌన్, మార్చి3 (ఆంధ్రజ్యోతి) తెలంగాణ రాష్ట్రం నల్గొండలో ఈ నెల 1, 2 తేదీల్లో జరిగిన సబ్ జూనియర్ బాలికల టార్గెట్‌బాల్ పోటీల్లో మండలంలోని కొత్తసత్రం బాలికలు శాలిని, సరిత, శ్రీలేఖలు ప్రతిభ చాటి విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పీడీ మురళి విజేతలను అభినందించారు.

న్యూస్ బాక్స్

సోమశిల నీటిమట్టం

అనంతసాగరం మార్చి3 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి సోమవారం వరద ప్రవాహం నమోదు కాలేదు. పూర్తి సామర్థ్యం 97.988 టీఎంసీలు కాగా 58.250 ప్రస్తుతం టీఎంసీలు ఉంది. డెల్టాకు 2,480, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

బాబా మందిర వార్షికోత్సవం

సంగం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పడమటిపాళెం షిరిడి సాయిబాబా మందిర వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కలశ స్థాపన, హోమం, పూజలకు కోటంరెడ్డి కుటుంబ సభ్యులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు.

భవన నిర్మాణ కూలి పెంపు

ఉదయగిరి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువులు, ఇతరత్రా ధరలు పెరిగిన దృష్ట్యా ఉదయగిరి ప్రాంతంలో భవన నిర్మాణ కూలీల రేట్లను పెంచినట్లు టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బొజ్జా శ్రీనివాసులు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఉన్న కూలీ రేట్లకు అదనంగా రూ.50 పెంచామన్నారు. ఇక నుంచి బేల్దారి మేస్త్రీకి రోజుకు రూ. 850, మహిళా కూలీకి రూ.550, పురుషుడికి రూ.600 నిర్ణయించినట్లు భవన నిర్మాణ యజమానులు సహకరించాలన్నారు.

సేవలు వినియోగించుకోండి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): ప్రభుత్వ పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 30వరకు గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకా ల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

చరిత్ర కనుమరుగు..

- రాయల కాలం నాటి సాగరం చెరువు
- కాలక్రమంలో ఆనవాళ్లు ధ్వంసం
- పట్టించుకోని పురావస్తుశాఖ అధికారులు



అనంతసాగరం చెరువు

అనంతసాగరం మార్చి3 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెరువు 15శతాబ్దంలో నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది. అలాంటి చెరువుకు సంబంధించిన పురాతన ఆనవాళ్లు కనుమరుగుతుండగా అధికారుల్లో చలనం లేదు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో రెండు కొండల మధ్య దీని నిర్మాణం చేపట్టారు. సుమారు 0.75 టీఎంసీలు నీటి సామర్థ్యం కలిగిన చెరువు కింద 5 వేల ఎకరాల ఆయకట్టుకు ఏటా రెండు పంటలకు నీరు సరిపడేలా నీరు ఉంటుంది. ఇక నిర్మాణంలో 5 నుంచి 20 అడుగుల పొడవు 3 నుంచి 5 మీటర్ల వెడల్పు, సుమారు టన్ను నుంచి 5 టన్నుల బరువు కలిగిన కొండ రాళ్లతో చెరువు కట్ట, అలుగు ప్రాంతాలను నిర్మించారు. అయితే నిర్మాణానికి కారణమైన ఈ రాళ్లు ఎక్కడి నుంచి సేకరించారు? ఎలా తెచ్చారు? అనేది ఇప్పటికీ అంతుచిక్కని ప్రశ్నగా ఉంది. ప్రధానంగా మూడు తూములు ద్వారా నీరు అందిస్తున్న సాగరం చెరువు జిల్లాలో పెద్ద చెరువుల్లో రెండవదిగా పేరుగడించింది. చెరువు కట్టపై అలనాటి చిన్నపాటి దేవాలయాలు, అలుగు ప్రాంతంలో చరిత్రకు సాక్ష్యంగా శిలాశాసనం, గొల్లభామ ప్రతిమ ఏర్పాటు చేశారు. 2007లో గొల్లభామ దేవతా ప్రతిమ కింద గుప్తనిధులు కోసం పెకలించగా తిరిగి పునరుజ్జీవనంతో శిలను పతిష్ఠించారు. ఇక అలుగు ప్రాంతాన్ని గత వైసీపీ ప్రభుత్వం ధ్వంసం చేసి అభివృద్ధి పేరుతో నూతనంగా నిర్మాణం చేపట్టారు. ఈక్రమంలో భారీ యంత్రాలతో ఉన్న రాళ్లు పెకలించి చరిత్ర ఆనవాళ్లు రూపరేఖలు కోల్పోయాయి. ఇప్పటికీ అలుగు నిర్మాణం కోసం వినియోగించిన పెద్ద బండలు అక్కడ ఉన్నాయి. శ్రీకృష్ణదేవరాయుల కాలం నాటి నిర్మాణం కావడంతో నేటికి దుండగలు గుప్త నిధులు కోసం అన్వేషణ సాగిస్తూ చెరువు పరిసరాల్లో తవ్వకాలు జరుపుతూ ఉన్నకాడికి దోచుకుపోతున్నారు. ఇకనైన సాగరం చెరువు భవిషత్తు తరాలకు తెలిసేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ధ్వంసం చేసిన శిలాశాసనం

వేర్వేరుగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- అర్జీదారుల తికమక



ఎంపీడీవో కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న షాలెట్

సంగం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాల్లో సోమవారం అధికారులు వేర్వేరుగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలు ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరించారు. గతంలో తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అర్జీలు అందచేసేవారు. అక్కడ అన్ని శాఖల అధికారులు హాజరయ్యేవారు. వచ్చిన అర్జీలను తహసీల్దారు పరిశీలించి అక్కడికక్కడే వాటి పరిష్కారానికి ఆయా శాఖల అధికారులకు పంపేవారు. కానీ సోమవారం తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సోమ్లా నాయక్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో షాలెట్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీదారులు ఎక్కడ, ఎవరికి అర్జీలు ఇవ్వాలో తెలియక తికమక పడ్డారు.

- **గ్రీవెన్స్‌కు ఆరు అర్జీలు**

ఉదయగిరి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై ప్రజలు ఆరు అర్జీలు అందజేసినట్లు తహసీల్దారు సుభద్ర, ఎంపీడీవో అప్పాజీలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు అందజేసిన అర్జీలకు సత్వరమే పరిష్కార మార్గం చూపుతున్నామన్నారు. ఇకపై ప్రతి శాఖ అధికారి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరు కావాలని, లేదంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ప్రజలు సైతం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని వారు కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎస్ఐ

ఉదయగిరి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): వాహనదారులు మోటార్ యాక్ట్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనా రెడ్డి హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టి పత్రాలు సరిలేని వాటికి జరిమానా విధించారు. ఈనెల 1 నుంచి మోటార్ యాక్ట్ ప్రకారం జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. వాహనదారులు డ్రైవింగ్ సమయంలో హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. పెండింగ్ చలానాలను వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం నూతన వాహన చట్టంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిన కాలనీ నిర్మాణాలను కాంట్రాక్టరే నిర్మించాలి

సంగం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వెంగారెడ్డిపాళెం జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలను గతంలో నిర్మించిన కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి పూర్తి చేయాలని సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి కోరారు. గత ప్రభుత్వంలో స్లాబు లెవల్ వరకు పనులు చేసి ఎన్నికలు రావడంతో నిలిపివేశారు. ఈ విషయంపై సోమవారం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి పంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులు, కాంట్రాక్టర్‌తో సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌ను ఒప్పించారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

చేజర్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని ప్ర భుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని తహసీల్దారు బి.మురళి సూచించారు. సోమవా రం స్థానిక ఆర్‌ఎస్‌కే కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన పరికరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ భాస్కర్ రెడ్డి, నాయకులు రావి లక్ష్మీనరసారెడ్డి, ఉడతా హజరత్తయ్య, ఏవో శశిధర్ పాల్గొన్నారు.

- సంగం: స్థానిక ధాన్యం కొనుగోలు కేంద్రానికి ధాన్యం విక్రయించి తొలి బోణీ చేసిన సంగం కంఠాబత్తిన శ్రీహరిరెడ్డి అనే రైతుకు సోమవారం రైతు బ్యాంకు ఖాతాకు రూ. 1,25,280ల నగదు జమ చేసినట్లు నాయకుల శ్రీనివాసులు యాదవ్, బాణా శ్రీనివాసులురెడ్డి, షేక్ బాబు తెలిపారు.

ఎండీయూ వాహనం మీద జగన్ బొమ్మపై ఆగ్రహం

ఉదయగిరి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): యాదవపాళెంలో రేషన్ పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనంపై మాజీ సీఎం జగన్ బొమ్మ ఉండటం చూసి టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బొజ్జా శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ అధికారంలో ఉందనే భ్రమలో ఉన్నారని తెలిపారు.

క్షయవ్యాధి నియంత్రణ బృందం పర్యటన

దుత్తలూరు(ఉదయగిరి), మార్చి 3(ఆంధ్రజ్యోతి): జిల్లా క్షయవ్యాధి నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలి ఆదేశాల మేరకు నర్రవాడ పీహెచ్‌సీ పరిధిలోని కొత్తపేట, నర్రవాడ పంచాయతీల్లో సోమవారం క్షయవ్యాధి నియంత్రణ బృందం పర్యటించింది. ఆయా పంచాయతీల్లో 2023 నుంచి క్షయవ్యాధితో బాధపడుతున్న రోగులను, ప్రస్తుతం దగ్గుతో బాధపడుతున్న అనుమానితుల నివాసాలకు వెళ్లి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. రెండు వారాలకు మించి దగ్గు ఉంటే వైద్యులు సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్రవాడ వైద్యాధికారి హరీష్, ఆరోగ్య పర్యవేక్షకులు రియాజ్, షబ్బీర్, షఫీ, పంచాయతీ కార్యదర్శి నజీముల్లా, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ ఇయర్ ఇంటర్ పరీక్ష ప్రశాంతం

సంగం/సీతారామపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : సంగంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలల్లో సోమవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం అయ్యాయి. 184 మంది విద్యార్థులకు 177 మంది హాజరైనట్లు పరీక్షల చీఫ్ సుమతి ఓ ప్రకటనలో తెలిపారు. సీతారామపురంలోని ఏపీ మోడల్ స్కూలులో జరిగిన పరీక్షలకు 112 మందికి 111 మంది విద్యార్థులు హాజరయ్యారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని సీఎస్ రెహమాన్ తెలిపారు.

150 ఎకరాల కబ్జాకు యత్నం

- జేసీకి గ్రామస్థుల ఫిర్యాదు

కలువాయి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తెలుగురాయపురంలో వివాదాస్పదంగా ఉన్న 150 ఎకరాల భూమిని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని దీన్ని అడ్డుకోవాలని గ్రామస్థులు సోమవారం జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 540 నుంచి 598 వరకు ఉన్న ప్రభుత్వ భూమి 150 ఎకరాలను ఒక వ్యక్తి 40 ఏళ్ల క్రితం పలువురు బినామీ పేర్లు మీద పట్టాలు తీసు కున్నారని పేర్కొన్నారు. అయితే గ్రామానికి ఎలాంటి సంబంధం లేని వ్యక్తులకు పట్టాలు ఇవ్వడంతో స్థానికులు వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. అప్పటి నుంచి ఈ విషయం కోర్టులో కేసు నడుస్తుందని తెలిపారు.

అంగన్‌వాడీలకు రవాణా భత్యం చెల్లింపు



కార్యకర్తలకు నగదు అందజేస్తున్న ఎంఈవో-2 శ్రీనివాసులు

ఉదయగిరి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలకు గతనెలలో నిర్వహించిన జ్ఞాన జ్యోతి కార్యక్రమానికి సంబంధించిన రవాణా భత్యం నగదును సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంఈవో-2 శ్రీనివాసులు అందజేశారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'టీఏలు ఇప్పించండి సార్' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆయన అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల పాటు శిక్షణ తరగతులకు సంబంధించి రవాణా భృతం కింద ప్రభుత్వం అందజేసిన రోజుకు రూ.50ల చొప్పున ఒక్కొక్కరికి రూ.300 చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తేజస్విని, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ప్రభావం

సమస్య పరిష్కారానికి కృషి

ఉదయగిరి రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్య పరిష్కారానికి తనవంతు బాధ్యతగా కృషి చేస్తానని ఉదయగిరి సబ్ డివిజన్ జేఈ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలి' కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఏడీఈ కోటేశ్వరరావు ఆదేశాల మేరకు గండిపాళెం మసీదు వీధిలో ఎప్పటి నుంచో నేలకొరిగి ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం సమీప నివాసాల ప్రజలతో చర్చించగా స్తంభం లేకపోవడంతో అంధకారం నెలకొందని వాపోయారు. దీంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన నూతన స్తంభాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఆయన వెంట లైన్‌మెన్ వెంకట్రావు ఉన్నారు.

నుడా అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

● చైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు (జడ్పీ), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నుడా సమగ్ర అభివృద్ధికి మెరుగైన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని అధికారులను నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆదేశించారు. ఆయన ఛాంబర్‌లో సోమవారం అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నుడా పరిధిలో పెద్దఎత్తున పరిశ్రమలు రానున్నాయని తెలిపారు. అలాగే నుడా సమగ్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అమలు చేసేలా అభివృద్ధికి ప్రణాళికలు రూపొం దించాలన్నారు. 2211 చదరపు కిలో మీటర్లు ఉన్న నుడాను అన్ని విధాలుగా అభి వృద్ధి చేస్తామని చెప్పారు. మంత్రి నారాయణ సహకారంతో అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుడతామన్నారు. భవిష్యత్తు తరాలు చెప్పుకునేలా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శం గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. సమావేశంలో టౌన్ ప్లానింగ్ అధికారి హిమబిందు, నుడా సెక్రటరీ పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌డీసీఎంఎస్ బిజినెస్ మేనేజరుగా రవికుమార్

● నెల కాకముందే సెలవుపై వెళ్లిన మోహన్‌కృష్ణ

నెల్లూరు (హరనాథపురం) మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (ఎన్‌డీసీఎంఎస్) బిజినెస్ మేనేజర్‌గా వీ. రవికుమార్ సోమవారం ఆ సొసైటీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేస్తున్న మోహన్‌కృష్ణ గతనెల 10న బాధ్యతలు స్వీకరించారు. నెలగడవక ముందే దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఆరు రోజులుగా ఆయన ఫోన్ స్విచ్చాప్ చేసి అందుబాటులో లేకుండాపోయారు. రైతులకు 2021 -22 సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి హమాలీ చార్జీలు చెల్లించాలని జేసీ కార్తీక్ ఆదేశించినా ఆయన చెల్లించకుండా వెళ్లినట్లు సమాచారం. దీంతో ఆయన స్థానంలో రవికుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీఎంఎస్ వ్యాపార అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. ధాన్యం సేకరణ ద్వారా లాభాలను ఆర్జించి పెడతామన్నారు.



వైభవంగా ధ్వజావరోహణం



నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని మూలాపేట భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో సోమవారం ఉదయం పాలభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు జరిగాయి. ఉదయం తీర్థవాది, రాత్రి ధ్వజావరోహణం, పూలంగిసేవ, విశేష పూజలు జరిగాయి. అనంతరం తిరుచ్చి ఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమాలను ఉభయకర్తలు, ఆలయ ఈవో ఏవీ. శ్రీనివాసులురెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.



● నీలకంఠేశ్వరాలయంలో..

మూలాపేట అన్నపూర్ణా సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి ధ్వజావరోహణం, తిరుచ్చి ఉత్సవాలు జరిగాయి. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు జరిగాయి.



వీఆర్ విద్యాలయానికి పూర్వ వైభవం

● ఈ విద్యాసంవత్సరం నుంచే శుభారంభం
● నర్సరీ నుంచి ఇంటర్ వరకు అన్నీ ఉచితమే!
● నగర పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య

నెల్లూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పి, గత పాలకుల పుణ్యమా అని మూతపడిన నెల్లూరులోని వెంకటగిరి రాజా (వీఆర్) విద్యాలయానికి మంచిరోజులు రాబోతున్నాయి. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ చొరవతో ఈ విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం కాబోతున్నాయి. వీఆర్ పాఠశాల ప్రాంగణంలో నర్సరీ నుంచి పదవ తరగతి వరకు, జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఇంటర్ తరగతులు నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయించుకుంది. మూడు రోజుల క్రితం మంత్రి నారాయణ, జేసీ కార్తీక్, ఇతర అధికారులతో వీఆర్ విద్యాలయాన్ని సందర్శించారు. భవనాల ఆధునీకరణకు అధికారులను ఆదేశించారు. రెండు, మూడు రోజుల్లో ఈ పనులు మొదలు కానున్నాయి. ఈ విద్యాసంవత్సరం నుంచే అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి.

● అన్నీ ఉచితమే...

వీఆర్ విద్యాలయంలో చేరే విద్యార్థులకు అన్నీ ఉచితంగానే అందిస్తారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ తోపాటు రవాణా సదుపాయం, పుస్తకాలు, స్టడీమెటీరియల్ సర్వం ఉచితంగానే అందజేస్తారు. పైగా ఫీజులు కూడా ఉండవు. పేదరికంలో పుట్టిపెరిగిన తనకు ఆ కష్టాలు తెలుసు కాబట్టి అన్నీ ఉచితంగా అందించాలని నిర్ణయించుకున్నానని, దీనికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా అంగీకరించారని మంత్రి నారాయణ తెలిపారు.

● రెట్టింపు వేగంతో..

2014-19 తెలుగుదేశం పాలనలో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ నెల్లూరు మున్సిపల్ పరిధిలో ప్రయోగాత్మకంగా రెసిడెన్షియల్ కళాశాల ఏర్పాటు చేసి ఉచిత విద్యను అందించిన విషయం తెలిసిందే. ఇక్కడ చదివిన ఎంతోమంది ఉన్నత స్థాయికి ఎదిగారు. పోటీ పరీక్షల్లో అర్హత సాధించారు. అయితే ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా మున్సిపల్ రెసిడెన్షియల్ కాలేజీని మూసేశారు. దీనివల్ల జరిగిన నష్టాన్ని ఎన్నికల ప్రచారంలో పలువురు ప్రజలు నారాయణ దృష్టికి తీసుకువచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉచిత రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల ఆలోచనను ప్రోత్సహించడంతో నారాయణ వీఆర్ విద్యాసంస్థల ప్రాంగణాన్ని ఎంచుకున్నారు.

ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

● కలెక్టర్ ఆనంద్ వెల్లడి
● పీజీఆర్ఎస్‌కు 436 వినతులు

నెల్లూరు (హరనాథపురం), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ప్రజలు అందిస్తున్న వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో సోమవారం (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వేదికకు 436 అర్జీలు వచ్చాయి. వీటిలో 169 వినతులు రెవెన్యూ శాఖకు సంబంధించివే.

● నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో సుమారు 500 డప్పు కళాకారుల కుటుంబాలు నివసిస్తున్నాయని, తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డప్పు కళాకారులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

● అసాంఘిక శక్తులకు హౌసింగ్ గృహాలు అడ్డాగా మారాయని, ఆ గృహాలను వెంటనే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్, బీజేపీ నాయకురాలు కందికట్ల రాజేశ్వరి కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నేతలు పొట్లూరు శ్రీనివాసులు, ప్రసాద్, రఘురామయ్య, పద్మ, సుజన, నాగేంద్ర సింగ్, ఓజిలి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు ప్రగతినగర్‌లోని 1933 సర్వే నెంబరును నిషేధిత జాబితా నుంచి తొలగించాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పఠాన్ సాబీర్‌ఖాన్ కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆయన వెంట ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ జియావుల్ హక్, మూతహర్, అసిఫ్, అబ్దుల్లా, నజీర్, వాజిస్, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

సార్.. న్యాయం చేయండి

నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో యూడీసీగా పనిచేస్తున్న ఉప్పలపాటి నాగరాజు ఇంక్రిమెంట్‌లు ఇప్పిస్తానని రూ. 40వేలు తీసుకుని మోసం చేశాడని, తనకు న్యాయం చేయాలని స్టాఫ్‌నర్సు టీ ప్రభావతి కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందచేశారు. ఏఎస్ పేట పీహెచ్‌సీలో తాను పనిచేస్తున్నప్పుడు 12, 18, 24 ఏళ్ల ఇంక్రిమెంట్‌కు సంబంధించి రావాల్సిన మొత్తం అధికారులకు బిల్లులు పెట్టాలని యూడీసీని కోరామన్నారు. ఈ ఇంక్రిమెంట్‌లు రావాలంటే రూ. 50వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. తాను రూ. 40 వేలు వరకు ఇచ్చామన్నారు. ఇంత వరకు ఇంక్రిమెంట్ తన ఖాతాలో జమ కాలేదన్నారు. నగదు అడిగితే బెదిరిస్తున్నాడని తెలిపారు. తనకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

● మలేషియా నుంచి మా బిడ్డల్ని రప్పించండి

తమ బిడ్డలు మలేషియాకు వెళ్లి స్థిరపడతారంటే సంతోషించామని, కానీ ఏజెంట్ మోసంతో వారు జైలుపాలయ్యారని రాపూరు మండలం తెగచర్లకు చెందిన కరిపం జయమ్మ, పెద్దయ్య దంపతులు కలెక్టర్ ఆనంద్ ఎదుట వాపోయారు. తమ బిడ్డలను ఇంటికి రప్పించి ఆదుకోవాలంటూ వినతిపత్రం ఇచ్చారు.

రీసర్వే తప్పులన్నీ వారంలో సరిదిద్దుతాం

● జాయింట్ కలెక్టర్ కార్తీక్

కలువాయి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మాదన్నగారిపల్లె రెవెన్యూ పరిధిలో రీ సర్వేతో జరిగిన తప్పులన్నీ సరిచేసి న్యాయం చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. మాదన్నగారిపల్లె, రామన్నగారిపల్లె గ్రామాల్లో వందలాది మంది పేదలకు పేదలకు జరిగిన ఈ అన్యాయం గత నెల 22వ తేదీ ఆంధ్రజ్యోతి వెలుగులోని తెచ్చింది. ఈ కథనంకు రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ భూములపై ఐదు రెవెన్యూ బృందాలతో విచారణ చేయించారు. ఈ నేపథ్యంలో జేసీ కార్తీక్, ఆత్మకూరు ఆర్డీవో పావని, రెవెన్యూ సిబ్బందితో కలసి సోమవారం మాదన్నగారిపల్లెలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రీసర్వే సమస్యలపై వచ్చిన దరఖాస్తులు స్వీకరించారు. 217 ఎకరాలు అసైన్డ్ భూమిని ప్రభుత్వ భూమిగా నమోదు చేసినట్లు నిర్ధారించామని, వాటిన్నంటినీ పట్టా భూములుగా నమోదు చేస్తామని వివరించారు. అడంగల్ కరెక్షన్ కింద వారం రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. కొందరు కొత్తగా అసైన్‌మెంటు పట్టాలు ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నారని వారి అర్హతలను పరిశీలించి అసైన్‌మెంట్ కమిటీకి సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సర్వే ఏడీ నాగశేఖర్, సర్వే డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసవర్మ, తహసీల్దారు శ్యామ్‌సుందరరాజు, డీటీలు వెంకటేశ్వర్లు, మంజుల పాల్గొన్నారు.



మాదన్నగారిపల్లెలో అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ

రేషన్ షాపులపై తనిఖీలు పెంచుతాం

అలాగు కలువాయిలోని 40 నెంబరు రేషన్ షాపులో సంబంధం లేని ఎండీయూ వాహనంలో బియ్యం లోడ్ చేస్తున్న విషయం ను కొందరు స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఈ విషయంలో విచారణ చేయిస్తానని చెప్పారు. మండలంలో ప్రతి రేషన్ దుకాణాన్ని కూడా తనిఖీ చేయిస్తామన్నారు.

ఎన్‌పీఎల్‌తో వీఎస్‌యూ భాగస్వామ్యానికి చర్చలు

వెంకటాచలం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని నేషనల్ ఫిజికల్ ల్యాబొరేటరీ (ఎన్‌పీఎల్)తో సోమవారం వీఎస్‌యూ భాగస్వామ్య ఒప్పందం దిశగా సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఈ మేరకు సోమవారం ఢిల్లీలోని వారి కార్యాలయంలో ఎన్‌పీఎల్ డైరెక్టర్ డాక్టర్ అచంట వేణుగోపాల్‌తో వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు భేటీ అయ్యి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వీసీ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన పరిశోధన అవకాశాలు, పరస్పర సహకారం, విద్యార్థుల శిక్షణ, రెండు సంస్థల మధ్య సహకార ఒప్పందం (ఎంవోయూ) వంటి చర్చలు జరిగాయన్నారు. దేశంలో ప్రముఖ పరిశోధనా సంస్థల్లో ఎన్‌పీఎల్‌కు ఒక ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. వీఎస్‌యూను సందర్శించాలని ఎన్‌పీఎల్ డైరెక్టర్ వేణుగోపాల్‌ను ఆహ్వానించినట్లు తెలిపారు. త్వరలోనే ఢిల్లీలో ఎన్‌పీఎల్‌తో వీఎస్‌యూ పరస్పర సహకార ఒప్పందం కుదుర్చుకుంటుందన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా అనేక ప్రముఖ సంస్థలతో భాగస్వామ్యం కలిగి ఉన్న ఎన్‌పీఎల్ వీఎస్‌యూతో శాస్త్రీయ, సాంకేతిక పరంగా సహకారం కొనసాగించేందుకు సానుకూలంగా స్పందించిందన్నారు.



ఎన్‌పీఎల్ డైరెక్టర్ వేణుగోపాల్‌తో వీఎస్‌యూ వీసీ శ్రీనివాసరావు

సర్వేపల్లి రిజర్వాయర్‌లో మహిళ మృతదేహం

వెంకటాచలం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొలగమూడి సమీపంలో ఉన్న సర్వేపల్లి కాలువలో పది రోజుల క్రితం కొట్టుకుపోయిన సుమారు 35 ఏళ్ల మహిళ మృతదేహం సోమవారం జోస ఫ్‌పేట వద్ద సర్వేపల్లి రిజర్వాయర్‌లో నీటిపై తేలాడింది. సోమవారం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో కాలువలో కొట్టుకుపోయిన మృతదేహం ఏమైందన్న ఉత్కంఠకు తెరపడింది.



ఆష్ తయారీలో యువకులు

భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు

● కొనసాగుతున్న 'రంజాన్' దీక్షలు
● ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లిం కుటుంబాలు

ఉదయగిరి రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ నెల ప్రారంభం కావడంతో ఆ కుటుంబాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలకు (రోజా) శ్రీకారం చుట్టారు. స్త్రీ, పురుషులు అనే భేదం లేకుండా అన్ని వయసులవారు నెల రోజులపాటు కఠోర దీక్షలు కొనసాగించి అల్లా పట్ల తమ భక్తిని చాటుకుంటారు. తెల్లవారుజాము సుమారు 5 గంటల సమయం నుంచి సాయంత్రం 6 గంటల పైబడి వరకు నిరంతరంగా దీక్షను కొనసాగిస్తారు. ఆ సమయంలో కనీసం ఉమ్మి కూడా మింగకుండా జాగ్రత్తగా వ్యవహరించి ఉపవాస రోజులను లెక్కిస్తారు. నిష్ఠగా అల్లాను ప్రార్థిస్తే కోరికలు నెరవేరడంతోపాటు పుణ్యాల ఫలితం కూడా రెట్టింపు స్థాయిలో అందుతుందనే ప్రగాఢ నమ్మకంతో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ఉపవాసాలు ఉండేందుకు అధికశాతం మంది సిద్ధమవుతుంటారు. దీక్ష విరమణలోనూ ఐకమత్యాన్ని చాటుతూ మసీదుల్లోనే ఇఫ్తారు విందు చేస్తారు. ఆ సమయంలోనూ ఉపవాసదారులు తమకు ఇష్టమైన తిండి పదార్థాలు, పండ్లు, పాయసం, చల్లని పానీయాలు వంటివి మసీదులకు తీసుకెళ్లి అందరికీ పంచిపెడుతూ ఉమ్మడిగా ఇఫ్తార్ చేయడం ఆనవాయితీ. కులమతాలకు అతీతంగా అందరూ తమవంతుగా మసీదులకు ఆహార పదార్థాలు అందజేసి భక్తిభావాన్ని చాటుకుంటారు. ఆ రోజుల్లో మహమ్మద్ ప్రవక్త దీక్ష విరమణను ఖర్జూరం పండుతో చేయడంతో నేటికీ ఆయన మార్గంలో నడుస్తున్న ముస్లింలు తొలి ప్రాధాన్యత ఆ పండుకే ఇస్తుండటం గమనార్హం.

● ప్రత్యేక వంటకాలు

రోజంతా దీక్ష పాటించిన ఉపవాసదారులకు ఉపశమనం కలిగేలా ప్రాంతాలను బట్టి మసీదులో ప్రత్యేక వంట లు చేస్తుంటారు. ఎండ వేడిమిని తట్టుకొనేలా శరీరం చల్లబడేందుకు అవసరమైన ఆహార పదార్థాలను రుచికరంగా తయారు చేస్తుంటారు. వీటిల్లో హలీం, ఆష్ ప్రత్యేకతను చాటుకుంటాయి. సాయంత్రం మసీదుల్లోనే వాటిని తయారు చేసి ఇఫ్తార్‌లో దీక్షాపరులకు అందజేస్తారు. అలాగే ఇళ్లలోని మహిళలకు సైతం సరఫరా చేస్తారు. అంతేగాక మసీదులవైపు వెళ్లిన ఇతరులకు కూడా వాటిని అందజేయడం పుణ్యకార్యంగా భావిస్తుంటారు.

● ప్రత్యేక ప్రార్థనలు తప్పనిసరి

నెల రోజులపాటు ముస్లింలంతా రోజుకు ఐదు పూటలా నమాజు అదనంగా రాత్రి పూట తరావీ పేరుతో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అందులో భాగంగా మత గురువులు రోజుకో అధ్యాయం చొప్పున నెల రోజుల వ్యవధిలో ఖురాన్ పఠనాన్ని పూర్తి చేయాల్సి ఉంటుంది. పురుషులు మసీదుల్లో ప్రార్థనలు కొనసాగించేందుకు వీలుగా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే మహిళలు నివాసాల్లోనే ప్రార్థనలు కొనసాగిస్తుంటారు.





ఇఫ్తార్ విందులో ముస్లింలు

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కోవూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు డిమాండు చేశారు. మండలంలోని పడుగుపాడు పీఏసీఎస్ కార్యాలయాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎకరా పొలంలో వరి పంట సాగు చేయడానికి రూ.40వేలు ఖర్చవుతుంటే మిలర్లు పుట్టి రూ.17 వేలుకు కొనుగోలు చేయడం అన్యాయమన్నారు. రైసు మిల్లర్ల వద్దనే డ్రైయర్లు, స్టీమ్ యంత్రాలు ఉండటంతో రైతులకు గిట్టుబాటు ధర అందడంలేదన్నారు. ప్రతి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపోయినన్ని గోనిసంచులు అందుబాటులో ఉంచాలని కోరారు. సొసైటీ సీఈవో కే గోవర్ధన్‌రెడ్డి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఆయనకు వివరించారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నాయకులు జక్కా శేషమ్మ, మూలి వెంగయ్య, ఎం పుల్లయ్య, గండవరపు శేషయ్య ఉన్నారు.

బాలిక కిడ్నాప్, లైంగికదాడి కేసులో పదేళ్ల జైలు

నెల్లూరు (లీగల్), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బాలికను కిడ్నాప్ చేసి, ఆపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో దేవరకొండ విజయకుమార్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ. 22 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో కోర్టు స్పెషల్ న్యాయాధికారి సిరిపిరెడ్డి సుమ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు, జలదంకి మండలం బ్రాహ్మణక్రాక ఎస్టీ కాలనీకి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన దేవరకొండ విజయకుమార్ 2017 జూన్ 27న అర్ధరాత్రి కిడ్నాప్ చేసి, ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడని అభియోగం. ఈ మేరకు జలదంకి పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయాధికారి పై విధంగా జైలుశిక్షతోపాటు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

సాయం పేరుతో భూమి స్వాహా

● వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని బాధిత గిరిజనుల వినతి

వెంకటాచలం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వేపల్లి పంచాయతీ లింగంగుంట గిరిజనులకు వైసీపీ నేతలు తీరని నమ్మకద్రోహం చేశారంటూ సోమవారం బాధిత గిరిజన రైతులతో కలిసి టీడీపీ నేతలు తహసీల్దారు ఎస్ శ్రీనివాసులకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ లింగంగుంట గిరిజన కాలనీకి చెందిన ఏడుగురికి గతంలో ప్రభుత్వం 6.20 ఎకరాలను పంపిణీ చేసిందని, అప్పటి నుంచి మెట్ట పైర్లు వేసుకుంటూ సాగు చేసుకుంట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో సర్వేపల్లికి చెందిన ఓ వైసీపీ నేత మరికొందరితో కలిసి మాకు సాయం చేస్తామంటూ ప్రభుత్వం తమకు ఇచ్చిన పట్టాలను తీసుకుని తెల్లకాగితాలపై వేలిముద్రలు వేయించుకున్నారని ఆరోపించారు. అప్పట్లో ఎకరాకు రూ.10 లక్షలు ఇస్తామని చెప్పి తమ వద్ద లాక్కున్న 6.20 ఎకరాల భూమిని ఎకరా రూ.33 లక్షలు చొప్పున అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని విమర్శించారు. ఇప్పుడు తమ భూముల్లో ఫ్యాక్టరీలు నిర్మించేశారని, టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక తమకు జరిగిన అన్యాయంపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామన్నారు. మోసపోయిన తమకు భూములు తిరిగి ఇప్పించాలని, లేనిపక్షంలో పరిహారమైన చెల్లించాలని డిమాండ్ చేశారు. తమను మోసం చేసిన వైసీపీ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వారివెంట సర్వేపల్లి టీడీపీ నేత బద్వేలు చెన్నకృష్ణయ్య ఉన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	111
లేయర్ లైవ్	80
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220
లేయర్	136

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8178
వెండి కిలో ధర	రూ. 96,400
వెండి ఒక గ్రాము	రూ.99.40

నెల్లూరు వెళ్లి దివ్యాంగుల అవస్థలు

వైకల్య పరీక్షల వాయిదా సమాచారమివ్వని వెల్ఫేర్ అసిస్టెంట్

సంగం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి):అన్నారెడ్డిపాలెం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉద్యోగి అలసత్వంతో మక్తాపురం దివ్యాంగులు అవస్థలు పడ్డారు. గ్రామానికి చెందిన 15 మంది వికలాంగత్వ పరీక్షల నిమిత్తం సోమవారం నెల్లూరులోని సర్వజన వైద్యశాలకు వెళ్లాలని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సూచించారు. ఆ మేరకు వారు సోమవారం నెల్లూరులోని జీజీహెచ్‌కు వెళ్లి విచారించగా వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని మండల అధికారులకు కూడా సమాచారం అందించామని చెప్పారు. దీంతో వారు స్థానిక ఎంపీడీవో షాలెట్‌కు ద్వారా సమాచారం అందించగా వాయిదా వేసినట్లు శనివారమే వెల్ఫేర్ అసిస్టెంట్‌కు సమాచారం ఇచ్చామని తెలిపారు. అయితే వాయిదా సమాచారాన్ని వెల్ఫేర్ అసిస్టెంట్ గ్రామంలోని దివ్యాంగులకు చెప్పడంలో నిర్లక్ష్యం చేయడంతో నెల్లూరు వెళ్లిన దివ్యాంగులు ఖర్చులతో పాటు పడిగాపులు కాయాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఇలాంటి సంఘటనలు మరోసారి జరగకుండా చర్యలు చేపట్టాలని స్థానిక టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, సునీల్‌రెడ్డి కోరారు.



నెల్లూరు ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో దివ్యాంగులు

14న అట్టహాసంగా జనసేన ఆవిర్భావ వేడుకలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జనసేన ఆవిర్భావ వేడుకలను అట్టహాసంగా నిర్వహించనున్నామని ఆ పార్టీ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్ తెలిపారు.పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని పురష్కరించుకొని ఈనెల 14న పిఠాపురానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు సుందరామిరెడ్డి, గునుకుల కిషోర్, వై రవి, కృష్ణారెడ్డి, జమీర్, తదితరులు పాల్గొన్నారు. పిఠాపురంలో ఈ నెల 14న జరగనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు కోరారు. నగరంలోని మాగుంటలేవుట్‌లో ఉన్న జనసేన నగర కార్యాలయంలో ఆవిర్భావ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు చప్పిడి శ్రీనివాసులురెడ్డి, నలిశెట్టి శ్రీధర్, షేక్ అలియా, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లను పునర్‌నిర్మించండి

నెల్లూరు(సిటీ), మార్చి 3(ఆంధ్రజ్యోతి) : నగరంలో ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో మరుగుదొడ్లను పునర్‌నిర్మించాలని జనసేన నాయకుడు, ఏడీసీ నందాను కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఆ పార్టీ నాయకుడు కిషోర్ మాట్లాడుతూ ప్రజలు, దుకాణదారులతో రద్దీగా ఉండే గాంధీ బొమ్మ, లీలామహల్ సెంటర్లలో ప్రజా మ రుగుదొడ్లను తిరిగి నిర్మించాలని చెప్పారు. నెల్లూరురూరల్లోని వడ్డిపాళెం వద్దనున్న కాలువ కట్టపై అక్రమ నిర్మాణాలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. కాగా 46,47,48 డివిజన్లలోని ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఏడీసీ దృష్టికి తీసుకెళ్లిన టీడీపీ నాయకుడు సుబ్బారావు, వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు.

నగరంలో లార్వా సర్వే



ఫీవర్ సర్వే వివరాలు నమోదు చేస్తున్న మలేరియా సిబ్బంది

నెల్లూరు (వైద్యం), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజాగారి వీధి సచివాలయం పరిధిలోని చమ్మం దివారితోట, శివాలయం వీధుల్లో సోమవారం వైద్య బృందం దోమల లార్వా సర్వే జరిపింది. భరత్ అనే వ్యక్తి ఇక్కడ జ్వరాలు ప్రబలుతున్నాయని ఫిర్యాదు చేయటంతో సోమవారం లార్వా సర్వే చేపట్టారు. అలాగే ఫీవర్ సర్వేను నిర్వహించారు. అయితే ఆయా ప్రాంతాల్లో జ్వరాలు లేవని వైద్య బృందం నిర్ధారించింది. కాలువలను పారిశుధ్య సిబ్బంది చేత శుభ్రం చేయించారు. నివాసప్రాంతాల్లో నీటి నిల్వలను ఉంచుకుంటే దోమల లార్వా పెరిగే అవకాశం ఉందని స్థానికులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో మలేరియా విభాగం హెల్త్ అసిస్టెంట్ నందకుమార్, కోటమిట్ట పట్టణ ఆరోగ్య కేంద్రం కో ఆర్డినేటర్ తిరుపతయ్య, ఏఎన్ఎం, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు అవగాహన సదస్సు

నెల్లూరు(క్రైం), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : నూతన మోటారు వాహన చట్టంపై పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లకు నగరంలోని రంగనాయకులపేటలోని కల్యాణ మండపంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నగర డీఎస్పీ పీ. సింధుప్రియ మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, లేని పక్షంలో జరిమానాలు విధిస్తామన్నారు.అత్యవసర పరిస్థితి వచ్చినప్పుడు డయల్ 112కు ఫోన్ చేసి పోలీసుల సేవలను పొందాలన్నారు.

జగదేవిపేట పీహెచ్‌సీ తనిఖీ

ఇందుకూరుపేట, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగదేవిపేట పీహెచ్‌సీని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి సోమవారం సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ విజయకుమార్, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్, స్టాఫ్ నర్సులు చాముండేశ్వరి, రమీజా హెల్త్ అసిస్టెంట్ మాధవ, ల్యాబ్ టెక్నీషియన్ హైమా, ఎఫ్ఎన్‌వో దివ్య, తదితరులు పాల్గొన్నారు.

8న మహిళలకు శిక్షణ

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 8వతేదీ మహిళా దినోత్సవం సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ, మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్టు సోమవారం ఎంపీడీవో శ్రీహరి, శాప్ జిల్లా కోర్డినేటర్ సునీల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు బుచ్చిలోని లోటస్ గ్రాండ్ కల్యాణ మండపంలో దరఖాస్తులు అందజేసి శిక్షణలో పాల్గొనాలని తెలిపారు.

నగరంలో సినీనటి ఐశ్వర్య



హీరో రోహిత్‌రెడ్డితో హీరోయిన్ ఐశ్వర్య రాజేష్

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ నగరంలో తళుక్కున మెరిసింది. సోమవారం ఆమె నగరంలో ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆమె రాకను ఊహించని అభిమానులు ఒక్కింత ఆశ్చర్యానికి గురయ్యారు. ఆమెతో సెల్ఫీలు దిగారు. అనంతరం ఆమె దిల్ దివానా ఫేమ్.. హీరో రోహిత్‌రెడ్డిని స్నేహపూర్వకంగా కలిశారు.

కంచె తొలగించారని ఫిర్యాదు

నెల్లూరురూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పయ్యకండ్రిగలో సురేంద్రకి చెందిన స్థలంలో కంచెను అక్రమంగా తొలగించారంటూ నెల్లూరు రూరల్ వైసీపీ నేత ఆనం విజయకుమార్‌రెడ్డి తహసీల్దారు లాజరస్‌కు వినతిపత్రం అందచేశారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో భాగంగా ఆయన ఈ మేరకు ఫిర్యాదు చేశారు. వీఆర్వో, సర్వేయర్ కలిసి వచ్చి ఈ కంచెను తొలగించారని చెప్పారు. ఈ సంఘటనపై విచారించాలన్నారు. పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని చెప్పారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి

నెల్లూరు(క్రైం), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అగ్రిగోల్డ్ భూముల్లోని జామాయిల్ కర్రను అక్రమంగా తరలిస్తుండగా, అడ్డుకున్న తమపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు ఎస్పీ కృష్ణకాంత్‌ను వారు సోమవారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ తిరుపతిరావు మాట్లాడుతూ ఈ విషయంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, దాడిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్పీను కలిసిన వారిలో జిల్లా గౌరవ అధ్యక్షుడు దామా వెంకయ్య, కార్యదర్శి రామదాసు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నెల్లూరు (జడ్పీ,ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లు మరమ్మతులు చేస్తున్నందున మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఈఈఎం శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

● ఆపై వీడియోలు, ఫొటోలతో బెదిరింపు

● ఎస్పీకి బాధితురాలి ఫిర్యాదు

ఆడిషన్స్ పేరుతో అత్యాచారం



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై న ఓ వ్యక్తి ఆడిషన్స్ పేరుతో హైదరాబాదుకి తీసుకెళ్లి మత్తుపానీయాలు ఇచ్చి, అత్యాచారం చేసి అసభ్యకర వీడియోలు, ఫొటోలు తీసి బెదిరిస్తున్నాడని ఓ బాధితురాలు ఎస్పీ జీ. కృష్ణకాంత్‌కు ఫిర్యాదు చేశారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదు ల పరిష్కార వేదిక జరిగింది. 85 మంది బాధితులు వారి సమస్యలను విన్నవించుకున్నారు. అందిన ఫిర్యాదుల్లో కొన్ని..

● నగరంలోని దర్గామిట్టకి చెందిన ఓ మహిళకు బారకాసు సెంటర్‌కి చెందిన సునీల్ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. సినీరంగంలో అడుగు పెట్టాలంటే ఆడిషన్స్ చేసేందుకు హైదరాబాద్‌కి పోవాలని న మ్మించి తీసుకెళ్లాడు. అక్కడ మత్తుపానీయాలు ఇచ్చి అత్యాచారం చేసి అసభ్యకర ఫొటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెడతానని బెదిరింపులకు దిగాడు. దీంతో బాధితురాలు పలుమార్లు నగదు ఇచ్చిం ది. అంతటితో ఆగకుండా దాడి చేసి తన మొబైల్ పగలగొట్టాడని, న్యా యం చేయాలని బాధితురాలు ఎస్పీని వేడుకున్నారు.

● పొదలకూరుకి చెందిన వ్యక్తికి అదే గ్రామానికి చెందిన సునీల్ హైదరాబాదు ఎయిర్‌పోర్టులో సూపర్‌వైజర్ ఉద్యోగం చేస్తున్నానని నమ్మించాడు. బాధితుడు కుమారుడికి ఎయిర్‌పోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని సునీల్ రూ.1.43 లక్షలు నగదు తీసుకున్నాడు. రోజులు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించ లేదని, తాను ఇచ్చిన నగదు ఇవ్వడం లేదని, న్యాయం చేయాలని బాధితుడు ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.

● టీపీ గూడూరుకి చెందిన మహిళ ఓ రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేస్తోంది. కాంట్రాక్టర్ రమేష్ తన కోరిక తీర్చాలని ఆ మహిళను పలుమార్లు కోరాడు. ఆమె అంగీకరించకపోవడంతో సాటి కూలీలతో కలిసి దాడి చేసి అవమానకరంగా మాట్లాడాడు.ఆ కాంట్రాక్టరు రమేష్‌పై చర్యలు తీసుకోవాలని బాధితురాలు కోరింది.

● భార్యాపిల్లలకు న్యాయం చేయలేని దువ్వాడ శ్రీనివాస్ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ పేర్కొన్నారు. దువ్వాడ శ్రీనివా స్ డిప్యూటీ సీఎంపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని అతడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్పీ సౌజన్యకు వినతిపత్రం ఇచ్చారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు (హరనాథపురం) మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులకు క్వాంటం ఆఫ్ పెన్షన్ పెంచి, బకాయిలను వెం టనే చెల్లించాలని విశ్రాంత సోషల్ వెల్ఫేర్ అధికారి షేక్.ఖాసిం సీఎం చంద్రబాబుకు సోమవారం లేఖ రాశారు. ఒక్కొక్క విశ్రాంత ఉద్యోగికి రూ.2లక్షల నుంచి రూ.3లక్షలపైనే బకాయిలు రావాల్సి ఉందని తెలిపారు. ఆసుపత్రివాళ్లకు కూడా ఇవ్వాల్సిన బకాయిలు రూ.కోట్లకు పేరుకొనిపోయినందున విశ్రాంత ఉద్యోగులను ఆ ఆసుపత్రుల్లోకి కూడా రానివ్వడంలేదని తెలిపారు. పీఆర్సీ ఛైర్మన్‌ను వెంటనే ప్రకటించి, పే ఫిక్సషన్ చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వీఎస్ఆర్ టీ-20 క్రికెట్ విజేత ఎన్‌యూసీసీ



విజేతగా నిలిచిన ఎన్‌యూసీసీ జట్టు

నెల్లూరు(విద్య), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టీ-20 లీగ్ క్రికెట్ పోటీల్లో నెల్లూరు యునైటెడ్ క్రికెట్ క్లబ్(ఎన్‌యూసీసీ) జట్టు విజేతగా నిలిచింది. బుజబుజనెల్లూరులోని సీఏఐ క్రికెట్ అకాడమీ మైదానంలో సోమవారం ఫైనల్స్ నిర్వహించారు. అతిథిగా హాజరైన ఏసీఏ మౌలిక సదుపాయల ఛైర్మన్ పీ. విజయ్‌కుమా ర్ మాట్లాడుతూ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు అన్నీ విభాగాల్లో పో టీల నిర్వహణ జరుగుతోందని, ఎక్కువ అవకా శాలు కల్పించేలా ఏసీఏ చర్యలు తీసుకుంటోం దన్నారు. అనంతరం జరిగిన ఫైనల్స్‌లో ఎన్ యూసీసీ, లార్ఫ్ క్రికెట్‌క్లబ్ తలపడ్డాయి. బ్యా టింగ్ చేసిన లార్ఫ్ క్రికెట్ క్లబ్ జట్టు 17 ఓవ ర్లలో 117 పరుగులకే ఆలౌట్ కావడంతో ఎన్ యూసీసీ జట్టు విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్టుతోపాటు రన్నరప్ జట్టుకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఏసీఏ స భ్యుడు పీ.భానుప్రకాష్‌రెడ్డి, జిల్లా అసోసియేష న్ సంయుక్త కార్యదర్శి కే.మునిగిరీష్, కోశాధికా రి ఎస్‌కె.అబూ బకర్, ఉపాధ్యక్షుడు ఎస్.గౌరీశంకర్, ఎన్‌డీసీఏ కేర్‌టేకర్ డీ.శ్రీనివాసరెడ్డి, సభ్యులు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, కే.శ్రీనివాసులు, బీ.లీలా మోహన్‌రెడ్డి, కోచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులంతా ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలి

నెల్లూరు(సిటీ) : నగరంలోని వ్యాపారులంతా విధిగా ట్రేడ్ లైసెన్సు, ఎన్‌వోసీ, శానిటేషన్ ధ్రువీకరణలు పొందాలని ఎన్ఎంసీ ఆరోగ్య అధికారి చైతన్య స్పష్టం చేశారు. సోమవారం నగరంలోని ఎంజీబీ మాల్లోని పలు షాపింగ్ మాల్స్, రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వ హించారు. వంటశాలల్లో పరిశుభ్రత, పారి శుధ్య నిర్వహణను పరిశీలించారు. అనంత రం మాట్లాడుతూ రెస్టారెంట్ల నిర్వాహకులు వంటశాలలను ఎప్పకప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తనిఖీల్లో ఎక్కడైనాలో పాలు ఉంటే జరిమానా విధిస్తామని తెలిపారు. కాగా అంతకుముందు పార్థసారధి నగర్, చింతారెడ్డిపాళెం, వావిలేటిపాడు ప్రాంతాల్లో పర్యటించి చెత్తకుండీలను ఏర్పాటు చేయించారు.

పోలియోను నివారించడమే గొప్పసేవ

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా పోలియో వ్యాధి నివారణ చేసిన ఘనత రోటరీ క్లబ్ దేనని, అదే సమాజానికి చేసిన గొప్పసేవ అని రోటరీ గవర్నర్ సాధుగోపాలకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన నగరంలోని రోటరీక్లబ్ నెల్లూరు, రోటరీ క్లబ్ సౌత్, రోటరీ క్లబ్ అవెన్యూస్, రోటరీ క్లబ్ శక్తిలను సందర్శించారు. క్లబ్ సభ్యులు చేస్తున్న సే వా కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ ఒమ్మిన సతీష్, అసిస్టెంట్ గవర్నర్ శేఖర్‌రెడ్డి, శివరామిరెడ్డి, సతీష్‌కుమార్, నరసింహరావు, పార్థసారధి, సుధాకర్‌రెడ్డి శ్రీకాంత్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కల్లబొల్లి మాటలతో రైతులను రెచ్చగొట్టొద్దు

వెంకటాచలం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కల్లబొల్లి మాటలతో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రైతులను రెచ్చగొట్టే పనిలో ఉన్నారని తెలుగురైతు రాష్ట్ర ప్రధానకార్యదర్శి రావూరి రాధాకృష్ణ మనాయుడు విమర్శించారు. మండలంలోని కసుమూరులో సోమవారం రైతులు పండించిన ధాన్యాన్ని ఆయన పరిశీలించా రు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రైతుల వద్ద ప్రతి గింజ ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుంద న్నారు. రైతులు ఎవరూ దళారులు, మిల్లర్ల మాటలు నమ్మిమోసపోవద్దని కోరారు. ఓపికగా వ్యహరించి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. రైతులకు ఏ కష్టం వచ్చినా అండగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఉన్నార న్నారు. రైతులు ఎవరూ కాకాణి మాటలను నమ్మేస్థితిలో లేరని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఏ ప్రసాద్‌నాయుడు, టీడీపీ నేతలు వెంకయ్యనాయుడు, బుర్ర శ్రీను, చిన్నబాబు, కడివేటి శేషయ్య పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర కల్పించండి : కాకాణి

వెంకటాచలం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని కసుమూరులో సోమవారం రైతులు పండించిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా రోడ్డు విస్తరణ పనులు

ఇందుకూరుపేట, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : అధికారుల పర్యవేక్షణ లేకుండా నెల్లూరు-మైపాడు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.48 కోట్ల సీఆర్ఐఎఫ్ నిధులతో పనులుదక్కించుకున్న కాంట్రాక్టర్ కూటమి ప్రభుత్వం తీసుకున్న 25శాతం కంటే తక్కువ పనిచేసిన పనులు రద్దు చే యాలని ఆదేశాలకు అప్రమత్తమై రోడ్డు విస్తరణ పనులు ప్రారం భించి కొనసాగిస్తున్నారన్నారు. పనులు ప్రారంభించిన వెంటనే అధికారులు పని నిలుపుదల చేయాలని నోటీసులు జారీ చేసిన లెక్కచేయకుండా పనులు కొనసాగిస్తున్నాడన్నారు. జిల్లా ఉన్నత అధికారులు కలుగజేసుకుని గుత్తేదారుడుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

మనుబోలు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తలారి దేవదానం రైతులతో కలిసి తహసీల్దారు సీహెచ్. సుబ్బయ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ధాన్యంకు దళారి దగ్గర సరైన ధర లేక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నార న్నారు. కేంద్రాలు ప్రారంభించి ధాన్యంను కొనుగోలు చేయాలన్నారు. కేరళ ప్రభుత్వం ఇచ్చినట్లుగా రైతులకు క్వింటాకు రూ.500 అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షకు ఇద్దరు గైర్హాజరు

వెంకటాచలం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో సోమవారం జరిగిన డిగ్రీ 3, 6వ సెమిస్టర్ మె గా సప్లిమెంట రీ పరీక్షలకు ఇద్దరు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ వెంకట్రాయులు ఒక ప్రకటనలో తెలిపారు.

బడ్జెట్‌లో జిల్లాకు భారీ కేటాయింపులు

● సీఎంకు కృతజ్ఞతలు : ఎమ్మెల్యే ప్రశాంతి



నెల్లూరు (హరనాధపురం) మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బడ్జెట్‌లో నెల్లూరు జిల్లాకు భారీ కేటాయింపులు చేసిన సీఎం చం ద్రబాబుకు కృతజ్ఞతలు తెలపుతున్నట్లు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. సోమవారం అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ తెలుగుగంగ ప్రాజెక్టుకు రూ.345కోట్లు, సోమశిల జలాశయానికి రూ.266 కోట్లు కేటా యించి అభివృద్ధికి బాటలు వేశారని ప్రశంసించారు. విక్రమ సింహపురి యూనివర్సిటీకి రూ. 20.53కోట్లు, రామాయపట్నం పోర్టుకు రూ.100 కోట్లు కేటాయించారని అన్నారు. అన్నదాత సుఖీభవ కింద జిల్లాలో రూ.1.77 లక్షల మంది రైతులకు రూ.247 కోట్లు పంపిణీ కాబోతున్నాయని, జిల్లాలో 12 వేల మంది మత్స్య కారులకు పెంచిన వేట నిషేధభృతి అందజేస్తామని స్పష్టం చేశారు. అలాగే కొడవలూరు మండలంలో ఉన్న కిసాన్ సెజ్‌కు కూడా నిధులు కేటాయించాలని ఆమె ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి విజ్ఞప్తి చేశారు.

వల కప్పకుండా డంపింగ్ యార్డుకు..



నగరంలోని నివాసాల వద్ద సేకరించిన చెత్తను అల్లీపురంలోని డంపింగ్ యార్డుకు తరలించే ట్రాక్టర్లు విధిగా పైన వల కప్పుకుని వెళ్లాలని ఇటీవల కమిషనర్ సూర్యతేజ ఆదేశాలు జారీ చేశారు. అలా చేయకుంటే రూ. 1000 జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కానీ సోమవారం నగరంలో చెత్తను తీసుకెళ్లే ట్రాక్టర్లు ఒక్కటి కూడా వల కప్పలేదు. కమిషనర్ ఆదేశించి వారం కాకముందే ఇంతటి నిర్లక్ష్యం ఏమిటో మరి..!

-నెల్లూరు(సిటీ, ఆంధ్రజ్యోతి)

9 మద్యం సీసాల స్వాధీనం

నెల్లూరు(క్రైం), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేట మండల కోడూరుపాడులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారి కథనం మేరకు, కోడూరుపాడులో అక్రమంగా మద్యం విక్రయాలు సాగిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఎక్సైజ్ నెల్లూరు-1 పోలీసులు సోమవారం దాడులు చేశారు.

చెత్తసంపద కేంద్రాల నిర్వహణపై శిక్షణ



గుంతల వద్ద చెత్త సేకరణ గురించి అవగాహన కల్పిస్తున్న డీఆర్‌సీలు

మనుబోలు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక చెత్త సంపద కేంద్రం మోడల్‌గా ఉండడంతో పలు మండలాల్లోని కార్యదర్శులకు, క్లాప్‌మిత్రలకు కేంద్రాల నిర్వహణపై ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. ఇందులో బాగంగా సోమవారం పొదలకూరు మండలంకు చెందిన కార్యదర్శులు, క్లాప్‌మిత్రలకు శిక్షణ ఇచ్చారు. డీపీఆర్ రమేష్‌బాబు, ఆర్‌పీ.మమత, కార్యదర్శులు, క్లాప్‌మిత్రలకు కేంద్రంలో తయారు చేసిన వర్మికంపోస్టు విధానం, నాడెప్‌లు, వాటినుంచి చెత్తను వేరుచేసే పద్ధతి, ఇంటి నుంచి తడి, పొడిచెత్త వేరుగా సేకరణ, వేరుచేసిన చెత్తను తొట్టెలలో వేసి వర్మికంపోస్టు ఎలా తయారు చేయాలి, తయారైన ఎరువును విక్రయించి పంచాయతీలకు ఆదాయం తీసుకువచ్చే విధానం.. తదితర అంశాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండలపంచాయతీ విస్తరణాధికారి నారాయణ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి చక్రస్నానం



కల్యాణ వేంకటేశ్వరస్వామికి చక్రస్నానం చేయిస్తున్న ఆలయ పండితులు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం రామకృష్ణానగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి ఆలయం ముందు ఉన్న పుష్కరిణిలో చక్రస్నానం వైభవంగా జరిగింది. తిరుమంజనం అనంతరం ఆలయ పండితులు స్వామివారికి పుష్కరిణిలో చక్రస్నానం చేయించారు. సాయంత్రం పుష్పయాగం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీతోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈకార్యక్రమాలకు గాదంశెట్టి వెంకటేశ్వర్లు, కలిగెల్పుల సురేష్ బాబా, ఆదూరు పూర్ణ చంద్రరావు కుటుంబాలు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

సమావేశ మందిరానికి స్థలం కేటాయించండి

● చైర్‌పర్సన్‌కు మాజీ ఉద్యోగుల వినతి

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సమావేశ మందిరానికి స్థలం కేటాయించాలని బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు మాల్యాద్రి, యానాదయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే బుచ్చిరెడ్డిపాళెం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 5 అర్జీలు వచ్చినట్టు తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు తెలిపారు.

ఏడాదికి రూ.20 కడితే.. రూ.2లక్షల బీమా

● ఎస్‌బీఐ మేనేజర్ పీఎస్.రాజు

పొదలకూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : సామాన్య ప్రజలకు లబ్ధి చేకూర్చే విధంగా కేంద్ర ప్రభుత్వం పలు పథకాలు అందిస్తోందని అందులో ఒకటి ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన అని, సంవత్సరానికి రూ.20కడితే ఏకంగా రూ.2లక్షల బీమా లభిస్తుందని పొదలకూరు ఎస్‌బీఐ మేనేజర్ పీఎస్.రాజు అన్నారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లికి చెందిన రాంపాటి రోశయ్య గత ఏడాది మే 13వ తేదీన తన వ్యక్తి గత ఖాతా ద్వారా ఈ పాలసీ చెల్లించారన్నారు. రోశయ్య జూన్ 1వ తేదీ తడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించడంతో నామినీగా ఉన్న వారి కుమారుడు రాంపాటి వెంకటేష్‌కు తమ శాఖకు దరఖాస్తు చేసుకున్న 10 రోజుల్లోనే పాలసీ సొమ్ము రూ.2లక్షల మొత్తం మంజూరైందన్నారు. ఆ మొత్తాన్ని సోమవారం నామినీ రాంపాటి వెంకటేష్‌కు ఆయన అందజేశారు.

చికెన్ వ్యర్థాల వాహనాల పట్టివేత


బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళయకాగొల్లు గ్రామం వద్ద చికెన్ వ్యర్థాలను రవాణా చేస్తున్న రెండు వాహనాలను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి చికెన్ వ్యర్థాలతో కాళయకాగొల్లు గ్రామం వద్ద చేపల గుంతలో వేసేందుకు వచ్చిన ఆ రెండు వాహనాలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆ వ్యర్థాలను నిర్వీర్యం చేయనున్నట్టు తెలిపారు. ఎక్కడైనా ఎవరైనా చికెన్, చేపల వ్యర్థాలు చేపల గుంతలకు రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

PUBLIC NOTICE

Under the instructions from our clients (1) Sri Ardhamala Srinivasulu, S/o. Veeraiah, sole proprietor of Srivari Enterprises, having its registered office at Kurugonda village of Ozili Mandal, Tirupati District, Aadhar No. 7514 4798 0099) and residing at Door No.5-2-1/27, Balaji Nagar, Old treasury office back side, Naidupeta-524126, Tirupati District and (2) R. Bayankar S/o Pedda Yalamandaiah, resident of Swarnamukhi Apartment, back side of Sri Venkateswara Theatre, Naidupeta, Tirupati District we hereby give you the following public notice:

To lend money one Devarapalli Venakeswara Rao, S/o not known, R/o Door No. 16-15-1055, Pinakini Avenue, Near Appollo Hospital opposite road, Nellore insisted No.1 of our client as well as surety ie., No.2 of our client to give blank signed pronotes and blank signed cheques. On 30-09-2018 Venkateswara Rao came to Naidupeta to the office of No.1 of our client and taken 15 blank signed promissory notes, 20 blank signed cheques of Corporation Bank, Naidupeta Branch bearing account No. 510101001500839 from two cheque books. Out of 15 blank signed promissory notes in some pronotes only figures like Rs. 2,50,000/- and Rs. 5,00,000/- were put and rest were blank signed pronotes. Similarly out of 20 blank signed cheques, 15 cheques are of Corporation Bank, Naidupeta Branch and 5 cheques are of S.B.I. Mallavaripalem Branch bearing account No. 00000032435393498. Similarly 10 blank signed promissory notes as well as 10 blank signed cheques of Corporation Bank of Naidupeta bearing account No. 510101001501266 from the cheque book with serial No. 524017662 (Five cheques) and State Bank of India of Sri City Mallavaripalem Branch bearing account No. 00000038537209659 from the surety by name Ravinoothala Bayankar ie., No.2 of our client were also taken by the said Venkateswarlu. On 28-01-2024 Devarapalli Venkateswara Rao insisted No.1 of our client to issue fresh signed blank promissory notes and fresh blank signed cheques in place of old signed blank pronotes and signed blank cheques. Without verifying the accounts No.1 of our client gave 6 blank signed promissory notes and 6 undated signed blank cheques bearing No. 000121 to 000126 of Karuru Vysya Bank, Naidupeta Branch account bearing No. 4869172000000441 in the name of D. Venkateswara rao by putting figure Rs. 3,00,000/- only without writing in words. D. Venkateswara Rao returned only 3 promisory notes out of 15 and returned 13 cheques out of 15 cheques of No.1 of our client on the ground that they were misplaced and they will be returned after they are traced. D.Venkateswara Rao returned 6 blank signed pronote out of 10 blank signed promissory notes and 3 blank signed cheques out of 5 cheques of Corporation Bank issued by No.2 of our client. After verification of accounts by No.1 of our client on suspicion it is found that an excess amount of Rs. 46,10,914/- was paid by him to D. Venkateswara Rao. When No.1 of our client approached Venkateswara rao on 24-02-2025 along with one R.Subramanyam and showed the details of accounts and requested him to pay back the excess amount collected from him and to return 12 signed blank promissory notes and 2 signed blank cheques which were collected from him on 30-09-2018 which are with him as well as 6 blank signed promissory notes and 6 undated signed cheques of Karuru Vysya Bank bearing serial No. 000121 to 000126 as detailed above which were collected on 28-01-2024 and 4 blank signed promissory notes and 2 blank signed cheques of Corporation Bank and 5 cheques of State Bank of India which were obtained from No.2 of our client on 30-09-2018 which are with D.Venkateswara Rao. But he deliberately refused to return the same. It amounts to criminal breach of trust and cheating. Our clients never gave any blank signed cheques or blank signed pronotes to others except D. Venkateswara Rao. If the above blank signed promissory notes and signed cheques of our clients are misused by anybody and try to be negotiated, our clients will not be held liable and suitable criminal action will be initiated against them. Our clients have already caused a legal notice dt. 01-03-2025 in this regard.

E. Prabhakara Reddy, J. Lakshmi Narayana,
P. Sri Vidya, Y. Rajesh Krishna, V. Kalpana,
Advocates, Srikalahasti, Tirupati District.





స్వర్ణముఖినది మీదుగా నిర్మించిన మట్టి దారి

స్వర్ణముఖి నదికి అడ్డంగా మట్టి రోడ్డు వేశారు. అదీ తిరుపతి నగరానికి సమీపాన.. నిత్యం వందలాది మంది పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగించే తనపల్లె తాత్కాలిక వంతెన పక్కనే నిర్మాణం చేపట్టారు. నది మీదుగా ఇలాగా కూడా దారి నిర్మించవచ్చా అని జనం అవాక్కవుతుంటే.. అధికారులేమో తమకు సంబంధం లేదన్నట్లుగా ఉంటున్నారు.

- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి



స్వర్ణముఖి నదిలో 'అడ్డ దారి'!

- అవతలివైపు లే అవుట్ కోసం నిర్మాణం
- పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు


నిలుపుదల చేయమని చెప్పాం

స్వర్ణముఖి నదికి అడ్డంగా దారి నిర్మాణానికి అనుమతిలేదు. నిలుపుదల చేయాలని ప్లాట్ల యజమానులకు సూచించాం. ఇప్పటికే ఆర్డీవో, రూరల్ తహసీల్దార్, గ్రామపంచాయతీ అధికారులకు కూడా ఫిర్యాదు చేశాం.

- రవిశంకర్, ఇరిగేషన్ ఏఈ

తిరుపతిరూరల్ మండలం తనపల్లె తాత్కాలిక వంతెనకు ఆనుకుని అవతలివైపున్న తిరుచానూరు పంచాయతీకి చెందిన ప్రైవేట్ భూమిలో వేసిన లేఅవుట్‌లో పలువురు గతంలో ప్లాట్లను కొనుగోలు చేశారు. ఎల్ఆర్ఎస్‌కోసం అప్పట్లో కొందరు తుడాకి నగదు చెల్లించారు. ఈ లేఅవుట్‌ను పరిశీలించిన తుడా అధికారులు దీనికి సరైనదారిలేకపోవడంతో ఎల్ఆర్ఎస్ ఇవ్వలేదని సమాచారం. దీంతో ప్లాట్ల కొనుగోలుదారుల్లో కొందరు ముందుకొచ్చి కమిటీని ఏర్పరచుకున్నారు. ఈక్రమంలో ప్లాట్లయజమానుల ఫోన్ నెంబర్లని సేకరించి ఒక్కో అంకణానికి రూ.వెయ్యి చొప్పున వసూలు చేసి నదిమీదుగా మట్టిదారి నిర్మాణం చేపట్టారనే ప్రచారం జరుగుతోంది. వర్షాకాలంలో నదిలోకి నీరుచేరితే ఇబ్బందులు ఎదురవుతాయని కొందరు సూచించినా వినలేదని తెలిసింది. వర్షాకాలం రాకముందే రోడ్డుకి రివిట్‌మెంట్ నిర్మిస్తామని చెప్పారని సమాచారం. ఇలా కమిటీలోని కొందరు ముఖ్యులు పట్టుపట్టి నదిలో దారి వేసినట్లు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వ భూమిని (వాటర్‌బాడీస్) పరిరక్షించాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఇంత జరుగుతున్నా తెలిసీతెలియనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు దారితీస్తోంది. కాగా, జనవరిలో నదిమీదుగా ఇదే దారిని నిర్మించేందుకు ఎక్స్‌కవేటర్ సాయంతో పనులు చేపట్టారు. ఈ సమాచారంతో స్థానిక వీఆర్వో స్పందించి సర్వేనంబరు 360కి సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో నదిపోరంబోకుగా నమోదైఉందని, దీనిలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని అడ్డుకున్నారు. అప్పట్లో కొన్ని రోజులపాటు పనులను ఆపేశారు. తిరిగి రెండునెలలు తిరగకముందే దాదాపుగా పూర్తిస్థాయిలో మట్టిదారి నిర్మాణం పూర్తయిపోతోంది.

అధ్యక్షా..



ఐదేళ్లలో ఒక్క పనీ జరగలేదు



గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా నేను తిరిగి తిరిగి కొన్ని రోడ్డు పనులు శాంక్షన్ చేసుకున్నా. రూ.33 కోట్లతో 36 రోడ్డు పనులు మంజూరైతే అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన పీఎల్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ వాటిని దక్కించుకుని కేవలం ఆరు రోడ్లే వేసింది. మిగిలినవి పెండింగ్‌లో పెట్టేసింది. ఎన్‌డీపీ కింద రూ.40 కోట్లతో 'నాగలాపురం - చిన్నపాండూరు' రోడ్డు విస్తరణ పనులూ వాళ్లే తీసుకుని చేయలేదు. ఇలా ఒక్క పని కూడా చేయకుండా.. ఆదిమూలం చేయలేదు అంటూ ప్రచారం చేశారు. నా నియోజకవర్గంలో పెద్దిరెడ్డి చెట్లు, మట్టి, ఇసుక అమ్ముకుని సహజ వనరులను దోచుకుంటూ నాపై నిందలు వేశారు. డిగ్రీ కాలేజీ పడిపోయేలాగా ఉంది. కొత్త భవనాల కోసం ఐదేళ్లు తిరిగినా ఫలితం లేదు. నా నియోజకవర్గంలో పీఆర్, ఆర్అండ్‌బీ రోడ్లు ఒక్కటీ జరగలేదు. దాసుకుప్పం బైపాస్ రోడ్డుకు రూ.26 కోట్లు శాంక్షన్ అయితే పనులు జరగలేదు. గ్రామీణ ప్రాంతాల్లో శ్మశానాలకు దారి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ పనులన్నీ మన ప్రభుత్వంలో చేపట్టి పూర్తిచేసి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి. అందుకు మీ సహకారం కావాలి.

- ఆదిమూలం, సత్యవేడు ఎమ్మెల్యే

ఎమ్మెల్యే రోజా!

- మాజీ అయినా.. కారుపై మారని స్టిక్కర్



రోజా కారుపై ఉన్న స్టిక్కర్

సత్యవేడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): 'ఎమ్మెల్యే రోజా'.. అదేంటి మాజీ అయిపోయారుగా అనుకుంటున్నారా? కానీ, ఆమె కారుకు ఇంకా ఎమ్మెల్యే రోజా అనే స్టిక్కర్ ఉంది. సోమవారం ఆమె తిరుపతి జిల్లా సత్యవేడుకు వచ్చిన కారులో ఎమ్మెల్యే ఆర్కే రోజా అని పెద్ద పెద్ద అక్షరాలతో స్టిక్కర్ ఏర్పాటు చేసుకోవడం చూసి పలువురు విస్మయం వ్యక్తం చేశారు. కాగా, ఇటీవల నగరిలో జరిగిన గొడవల నేపథ్యంలో సత్యవేడు సబ్‌జైలులో విచారణ ఖైదీలుగా ఉన్న వైసీపీ నేతలను సోమవారం ఆమె ములాఖత్ ద్వారా పరామర్శించారు. జైలు వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. ఎప్పుడో ఐదారేళ్ల క్రితం మాట్లాడిన మాటలతో ఇప్పుడు మనోభావాలు దెబ్బతిన్నాయని పోసాని కృష్ణ మురళిని అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. ఆయనకు ఆరోగ్యం బాగాలేకున్నా, అరెస్ట్ చేశారన్నారు. తాము అధికారంలోకి వచ్చాక వడ్డీ సహా తిరిగి చెల్లిస్తామన్నారు. నగరిలో వైసీపీ నాయకలను లక్ష్యంగా చేసుకుని కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు.



ధ్వజావరోహణం సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



ముక్కంటి ఆలయంలో శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం

శ్రీకాళహస్తి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం నిర్వహించారు. స్వామివారి గర్భాలయానికి ఎదురుగా ఉన్న ధ్వజస్తంభంపై వృషభ సంకేత ధవళ పతాకాన్ని అవనతం చేశారు. అంతకుముందు అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ధ్వజస్తంభం వద్దకు తీసుకువచ్చి కొలువుదీర్చారు. ఆ తరువాత యాగశాలలో పది రోజుల నుంచి పూజలందుకున్న స్వామి అమ్మవార్ల ఆవాహన కలశాలకు పూజలు చేశారు. యాగశాల నుంచి కలశాలను అర్చకులు తలపై పెట్టుకుని ఆలయంలో ప్రదక్షిణ చేసిన అనంతరం స్వామివారి ధ్వజస్తంభం వద్దకు తీసుకొచ్చి.. ఆగమోక్తంగా కలశ ఉద్వాసన పలికారు. చివరిగా ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేసి ధ్వజవరోహణ క్రతువును పూర్తి చేశారు. ధ్వజస్తంభానికి ఏర్పాటుచేసిన ధవళ పతాకం, దారాన్ని చతుర్మాడవీధుల్లో కొలువైన నవ సంధి వినాయకులకు దర్శింపచేశారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాహన సేవలు

మహాశివరాత్రి ఉత్సవాల్లో 11వ రోజైన సోమవారం ఉదయం స్వామి అమ్మవార్లకు కేడిగ వాహన సేవ నిర్వహించారు. రాత్రి శ్రీకాళహస్తీశ్వరుడు సింహాసనం, పార్వతీదేవి కామధేనువుపై ఊరేగుతూ భక్తులను కటక్షించారు. పురవీధుల్లో ఊరేగుతున్న పార్వతీ పరమేశ్వరులకు భక్తులు కర్పూర హారతులు సమర్పించారు.

తిరుమలలో బాలిక కిడ్నాప్

- వెంట తీసుకెళ్లిన పారిశుధ్య కార్మికురాలు
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో గాలింపు
- మూడున్నర గంటల్లోనే తిరుపతిలో గుర్తించిన పోలీసులు



దీక్షిత (ఫైల్ ఫొటో)



సీసీ ఫుటేజీలో గుర్తించిన కిడ్నాపర్ ఈమె

తిరుమల, మార్చి3 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో సోమవారం కిడ్నాప్ అయిన నాలుగేళ్ల బాలికను.. మూడున్నర గంటల్లోనే పోలీసులు పట్టుకున్నారు. తమ బిడ్డ కనిపించడం లేదంటూ తల్లిదండ్రులు ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు రంగంలోకి దిగి.. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా బాలికను, ఆమెను తీసుకెళ్లిన మహిళను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విజయవాడకు చెందిన నరసింహులు దంపతులు తమ నాలుగేళ్ల కుమార్తె దీక్షితతో కలిసి గతేడాదిగా తిరుమలలోని చిరువ్యాపారులుగా జీవనం సాగిస్తున్నారు. సోమవారం సాయంత్రం తమ కుమార్తె ఆడుకుంటున్న సమయంలో వీరు పనుల్లో నిమగ్నమయ్యారు. రాత్రి 7 గంటల సమయంలో దీక్షిత కోసం గాలించగా ఎక్కడా కనిపించలేదు. దీంతో తమ కుమార్తె కనిపించడం లేదంటూ విజిలెన్స్, పోలీసులను ఆశ్రయించారు. వెంటనే కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుకుని సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించారు. గుర్తుతెలియని మహిళ దీక్షితను వెంట తీసుకెళ్లినట్టు గుర్తించారు. సాయంత్రం 6.30 గంటల సమయంలో బాలిక సహా ఏపీ 03 జెడ్ 5587 నెంబరు గల ఆర్టీసీ బస్సు ఎక్కి తిరుపతికి వెళ్లినట్టు కెమెరాల్లో రికార్డయింది. వినాయకనగర్ సమీపంలో బస్సు దిగినట్టు గుర్తించిన పోలీసులు బృందాలుగా విడిపోయి గాలించారు. ఎట్టకేలకు రాత్రి 10.30 గంటల సమయంలో తిరుపతిలోని పెద్దకాపు లేఅవుట్‌లోని ఓ ఇంట్లో చిన్నారిని, మహిళను గుర్తించారు. చిన్నారిని తీసుకెళ్లిన మహిళ తిరుమలలో ఓ ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికురాలు నాగ వెంకటరమణగా తేలింది. చిన్నారి ఒంటరిగా ఉందని, తనతో పాటు వస్తున్న క్రమంలోనే తీసుకొచ్చానే తప్ప మరో ఉద్దేశ్యం లేదని ఆమె తెలిపింది. అయినప్పటికీ పోలీసులు తమ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కాగా, బాలికను తిరుపతి నుంచి రాత్రి తిరుమలకు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఆచూకీ తెలిపిన కోట్

బాలిక ఆచూకీ గంటల వ్యవధిలోనే తెలుసుకోవడంలో మహిళ ధరించిన కోట్ కీలకంగా మారింది. సీసీ కెమెరాల ఫుటేజ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసిన పోలీసులకు మహిళ ధరించిన దుస్తులపై ఓ సంస్థ పేరు కనిపించింది. దీంతో తిరుమలలోనే పనిచేసే ఉద్యోగి అయి ఉంటుందని భావించారు. కోట్‌పై ఉన్న సంస్థ పేరు ఆధారంగా ఆసంస్థలో పనిచేసే కొందరు ఉద్యోగులను పోలీసులు ప్రశ్నించారు. ఈక్రమంలోనే ఆ మహిళ పేరు, ఫోన్ నెంబరు తెలిసినట్టు సమాచారం. దీని ఆధారంగానే మహిళను అతి తక్కువ సమయంలో పట్టుకోగలిగారు.

కన్నులపండువగా వసంతోత్సవం



త్రిశూల స్నానం



స్వామిఅమ్మవార్లకు అభిషేకం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం వసంతోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. నూతన వధూవరులైన శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబ ఉత్సవర్లను వసంతోత్సవ మండపంలో కొలువుదీర్చారు. స్వామిఅమ్మవార్లకు గోక్షీరం, పెరుగు, నెయ్యి, పసుపు, కుంకుమ, చందన, పంచామృత, విభూది, నారీకేళ, నదీ పుణ్యజలాలతో అభిషేకించారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపి కర్పూరహారతులు సమర్పించారు. ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం సూర్య పుష్కరిణి వద్దకు అర్చకులు త్రిశూలాన్ని తీసుకొచ్చి అభిషేకాలు నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

రాత్రి 8గంటలకు: పల్లకీ సేవ

ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- 29,355 మంది విద్యార్థులకుగాను 28,783 మంది హాజరు



తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాల కేంద్రం వద్ద విద్యార్థులు

తిరుపతి (విద్య), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొత్తం 100 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. తొలి రోజు సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2కు 29,355 మంది జనరల్, ఒకేషనల్ విద్యార్థులకుగాను 28,783 మంది పరీక్షకు హాజరుకాగా 572 మంది గైర్హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ చోటుచేసుకోలేదని ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ లాంగ్వేజ్ పేపర్-1 పరీక్ష జరుగనుంది.

సత్యవేడులో పాము కలకలం

సత్యవేడు, ఆంధ్రజ్యోతి: సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో సోమవారం పాము కలకలం రేపింది. పరీక్షలు జరుగుతున్న సమయంలో ఒక పాము వచ్చి స్క్వాడ్ అధికారి కాలుకు చుట్టుకుంది. దీంతో అప్రమత్తమైన ఆయన వెంటనే విదిలించడంతో పాము దూరంగా పడిపోయి వెళ్లింది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళవారం) : 6.24

సహరి (బుధవారం) : 5.08

మందుబాబులకు అడ్డాగా హెలిప్యాడ్



కట్టవ గ్రామం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్

తడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తడ మండలం మాంబట్టు సెజ్‌లోని ఏపీఐఐసీ భూముల్లో కట్టవ గ్రామానికి సమీపాన ఉన్న హెలిప్యాడ్ మందుబాబులకు అడ్డాగా మారింది. సూళ్లూరుపేట నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాన చేసేందుకు 2023 నవంబరు 20న అప్పటి ముఖ్యమంత్రి జగన్ పర్యటన ఖరారైంది. దీంతో హడావిడిగా కట్టవ గ్రామానికి సమీపాన హెలిప్యాడ్ నిర్మించారు. అయితే ముందు రోజు రాత్రి కురిసిన భారీ వర్షంతో జగన్ పర్యటన రద్దు అయింది. ఆ తరువాత జగన్ నియోజకవర్గ పర్యటనకు రాలేదు. దీంతో హెలిప్యాడ్ నిర్మాణానికి వెచ్చించిన నిధులు వృథా అయ్యాయి. ఇదిలా ఉండగా చుట్టుపక్కల ప్రాంతాల మందుబాబులకు హెలిప్యాడ్ మంది వేదికైంది. ప్రశాంతంగా మందేసేందుకు చక్కటి స్థలం దొరికింది. ఇది గమనించిన పోలీసులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



ఉచిత క్యాన్సర్ స్ర్కీనింగ్ క్యాంపులో వైద్యులు, స్థానికులు

చిల్లకూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చింతవరం పీహెచ్‌సీ డాక్టర్ పాల్ జాన్సన్ అన్నారు. సోమవారం మండలం లోని బల్లవోలు, తూర్పు కనుపూరు గ్రామాల్లోని ప్రజలకు తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్ జాన్సన్ మాట్లాడుతూ స్విమ్స్ ఆధ్వర్యంలోని పింక్ బస్ ద్వారా పురుషులకు నోటి, మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. చింతవరం పీహెచ్‌సీ పరిధిలో చేడిమాలలో 4వ తేదీన, తిక్కవరం, ఏరూరు గ్రామాల్లో 6వ తేదీన క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుమ, స్విమ్స్ వైద్యాధికారులు డాక్టర్ పద్మావతి, డాక్టర్ చైతన్యబాను, వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు



జంపింగ్ రోప్ పోటీల్లో జాతీయస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులతో రోటరీవెస్ట్ క్లబ్ సభ్యులు

గూడూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం రెట్టపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు జంపింగ్ రోప్ క్రీడలో జాతీయస్థాయిలో ప్రతిభ చాటడంతో వారికి రోటరీవెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులను అందజేసి సన్మానించారు. అదేవిధంగా సరస్వతి శిశుమందిరం పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన ఫర్నీచర్ అందజేశామన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ గోపాలకృష్ణ, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు, శ్రీకాంత్‌రెడ్డి, మునిగిరీష్, నాశిన నాగులు, గిరిబాబు, ధనుంజయరెడ్డి, వాసు, బొమ్మిడి శ్రీనివాసులు, సనత్‌కుమార్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, మల్లు విజయ్‌కుమార్ రెడ్డి, తాళ్లూరు శ్రీనివాసులు, హరి, శివ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీవో షంషాద్ బేగం, సీఐ రమణ, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు

వెంకటగిరిటౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజావీధి నుంచి కాశీపేట కూడలి వరకు సీడీపీవో షంషాద్ బేగం ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లను ఎదగనివ్వాలని తల్లిదండ్రులు చేయాలని కోరారు. బాల్యవివాహాల వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో సీఐ రమణ, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

6న ఆర్‌సీరెడ్డి కాలేజీలో జాబ్‌మేళా

తిరుపతిరూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ విజయనగర్ కాలనీలోని డాక్టర్ ఆర్‌సీరెడ్డి డిగ్రీ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఈనెల 6న ఉదయం 8.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ డాక్టర్ పి.రవిచంద్రా రెడ్డి పేర్కొన్నారు. అపోలో ఫార్మసీ, అపోలో టైర్స్, ముత్తూట్ గ్రూప్, లోకల్ సర్వీస్ మొబైల్ యాప్, ఎన్‌వోసీపీఎల్-న్యూ ఆపర్చ్యునిటీ కన్సల్టెన్సీ సంస్థల్లో ఉద్యోగాల కోసం ఈ మేళా నిర్వహిస్తున్నామని వివరించారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ విద్యార్హతలు, వయసు ఆధారంగా ఇంటర్వ్యూలు ఉంటాయని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీవోవీ.ఇన్ లింక్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాల కోసం 9074919939, 9988853335లను సంప్రదించాలని కోరారు.

● **ఐటీఐలో ఉద్యోగ మేళా:** తిరుచానూరు రోడ్డు పద్మావతి పురంలోని ప్రభుత్వ ఐటీఐలో సబ్ ఎంప్లాయిమెంట్ ఆఫీస్ ఆధ్వ ర్యంలో ఈనెల 6న ఉదయం 10 గంటలకు ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎస్.వెంకటరమణ పేర్కొన్నారు. మోట్రోల సంస్థలో మొబైల్ ఆపరేటర్స్ ఉద్యోగం కోసం నిర్వహించే ఈ మేళాకు టెన్త్ ఉత్తీర్ణత/ ఫెయిల్, ఇంటర్, డిగ్రీ, బీటెక్ విద్యార్హత ఉన్న వారు(స్త్రీ, పురుషులు) హాజరుకావచ్చని తెలిపారు. 18-30 ఏళ్లలోపు వయసు ఉండాలని వెల్లడిం చారు. వివరాల కోసం 9392275861ను సంప్రదించాలని కోరారు.

విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(ఆటోనగర్), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం తిరుపతి జిల్లా పరిధిలో గృహ విద్యుత్ వినియోగదారుల సౌలభ్యం కోసం అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఈ పి.సురేంద్రనాయుడు కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) 50 శాతం రాయితీ కల్పిస్తుందని తెలిపారు. మంగళవారం నుంచి జూన్ 30 వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఇంటి సర్వీసు తీసుకుంటున్న సమయంలో అంగీకరించిన లోడ్ కంటే, ఎక్కువ లోడ్ వినియోగిస్తున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ప్రజా విజ్ఞప్తులకు సత్వర పరిష్కారం

డక్కిలి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా విజ్ఞప్తులకు సత్వరం పరిష్కారం చూపుతామని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం డక్కిలి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యాక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఎక్కువగా భూ సమస్యలు, పింఛన్లు మంజూరు చేయాలని అర్జీలు అందాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న రాణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రియాంక, మండల సర్వేయర్ రాజగోపాల్, వీఆర్వోలు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీలపై వీఆర్వోలకు సూచలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

మొక్కుబడిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పలు శాఖల అధికారుల డుమ్మా ● సంతకాలు చేసి వెళ్లిపోతున్న మరికొందరు

సూళ్లూరుపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సూళ్లూరుపేటలో మొక్కుబడిగా సాగుతోంది. పలుశాఖ అధికారులు డుమ్మా కొడుతుండగా, కొందరు మొక్కుబడిగా హాజరై సంతకాలు పెట్టి వెళ్లిపోతున్నారు. సోమవారం సూళ్లూరుపేట తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండల పరిషత్, గృహ నిర్మాణ, విద్యుత్, శిశుసంక్షేమ, ఆర్‌డబ్ల్యూఎస్, సర్వేశాఖ అధికారులు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన శాఖలకు చెందిన అధికారులెవ్వరూ రాలేదు. ముఖ్యంగా ప్రజలతో నిరంతరం సంబంధాలుండే వ్యవసాయ, పశుసంవర్ధక, జలవనరులు, వైద్యం, ఆర్టీసీ, వన్యప్రాణి, విద్య తదితర శాఖల అధికారులు గ్రీవెన్స్‌లో పాల్గొనకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగకుండా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. అక్కడే అన్ని శాఖల అధికారులు వినతిపత్రాలు స్వీకరించి సమస్యలను పరిష్క రించేందుకు వీలుగా ప్రతివారం మండల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అయితే పలుశాఖల అధికారులు మొక్కుబడిగా హాజరై సంతకాలు పెట్టి వెళ్లిపోవడం, కొందరు పూర్తి డుమ్మా కొడుతుండడంతో ప్రభుత్వ ఉద్దేశం నీరుగారిపోతోంది. దీనిపై తహసీల్దార్ నరసింహరావును వివరణ కోరగా అన్నిశాఖల అధికారులు గ్రీవెన్స్‌కు తప్పకుండా రావాలని, హాజరైన అధికారుల వివరాలు ఆర్డీవోకు పంపామన్నారు.

పెళ్లకూరు: మండలం కేంద్రమైన పెళ్లకూరు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఎంపీడీవో, వ్యవసాయ, గృహ నిర్మాణం, వెలుగు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాత్రమే హాజరయ్యారు. విద్యుత్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, ఉద్యానశాఖ, వైద్యం తదితర ముఖ్య శాఖలకు చెందిన అధికారులు రాకపోవడంతో సంబంధిత సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారులు నిరాశతో వెనుతిరగాల్సి వచ్చింది. ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అన్నిశాఖల అధికారులు హాజరయ్యేలా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సూళ్లూరుపేట తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరైన ఆరుగురు అధికారులు

నిద్రమత్తు వల్లే తెల్లవారుజామున ప్రమాదాలు

డక్కిలి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్లీ పోలీస్ కార్యక్రమంలో భాగంగా డక్కిలి పోలీసులు తెల్లవారుజామున వాహనాలు నడిపే డ్రైవర్లకు ఫేష్ వాషింగ్ కార్యక్రమం చేపట్టారు. ఏర్పేడు - పెంచలకోన నడుమ జాతీయ రహదారిలో తిరిగే లారీలను ఆపి పోలీసులు డ్రైవర్లకు వాటర్ బాటిళ్లు అందజేసి ఫేష్ వాషింగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జాతీయ రహదారిపై ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగు తుండడంతో పోలీసులు నివారణ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం తెల్లవారుజామున లారీ డ్రైవర్లకు వాటర్ బాటిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శివశంకర్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ లారీ డ్రైవర్లు రాత్రంతా వాహనాలు నడపడం వల్ల తెల్లవారుజామున నిద్రలోకి జారుకొంటుండడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. నిద్రవస్తే రోడ్డు పక్కన ఆపి కొంతసేపు విశ్రాంతి తీసుకుని వాహనం నడపాలని డ్రైవర్లకు సూచించారు.



లారీ డ్రైవర్ ముఖం కడుక్కోడానికి నీళ్లు అందిస్తున్న ఎస్‌ఐ శివశంకర్ గౌడ్

తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.102 కోట్ల మంజూరు

గూడూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా శాశ్వతంగా పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం ద్వారా రూ.102 కోట్లు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పట్టణానికి కండలేరు జలాశయం నుంచి పైపులైన్ల ద్వారా తాగునీటి సరఫరా జరుగుతోందన్నారు. ఈ పైపులు తరచూ లీకేజీల కారణంగా మరమ్మతులకు గురవుతుండడంతో నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తేవన్నారు. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా కేంద్రాన్ని సంప్రదించి అమృత్ పథకం కింద ప్రస్తుతం ఉన్న జీఆర్‌పీ(గ్లాస్ రీ ఇన్‌ఫోర్స్‌డ్ ప్లాస్టిక్) పైపులైన్ల స్థానంలో డీఐ(డక్ టైల్ ఐరన్) పైపులైన్లు అమర్చేందుకు రూ.102 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధుల విడుదలకు కృషి చేసిన సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఎమ్మెల్యే పాశిం కృతజ్ఞతలు తెలిపారు.

పరిహారం రైతులకే ఇవ్వాలి



ఆర్డీవో కిరణ్మయికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు అల్లెయ్య, పద్మనాభం, జనార్దన్ తదితరులు

సూళ్లూరుపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ పారిశ్రామికవాడ భూసేకరణలో పట్టాదారులైన రైతులకే పరిహారం ఇవ్వాలని సీపీఎం నాయకులు సోమవారం ఆర్డీవో కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేత జనార్దన్ మాట్లాడుతూ సత్యవేడు మండలం ఇరుగలం, కొల్లడం, పెద్దఈటిపాకం, చిన్నఈటిపాకం గ్రామాల్లో చేస్తున్న భూసేకరణలో పొరపాట్లు ఉన్నాయని, వాటిని పరిశీలించి పట్టాదారులైన రైతులకే పరిహారం ఇవ్వాలన్నారు. అదేవిధంగా బీఎన్‌కండ్రికండ్రిగ మండలం కుక్కంబాకం గ్రామంలో సర్వే నెం.81లో ఉన్న ప్రభుత్వ భూమిని 40మంది దళితులు పది సంవత్సరాల పైబడి సాగు చేసుకొంటున్నారని, వారికి పట్టాలు ఇవ్వాలని ఆర్డీవోకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అల్లెయ్య, పద్మనాభయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు మంజూరు చేయాలి

సూళ్లూరుపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికీ కొత్త పింఛన్లు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి ఆనంద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్త పింఛన్లు ఇవ్వాలని చేయాలని ఇప్పటికే పలుసార్లు సచివాలయాల్లో అర్జీలు ఇచ్చినా మంజూరు కాలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వేలు, వెంకటేశ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మోటర్ సైకిల్‌ను ఢీకొన్న ట్రాక్టర్: ఒకరి మృతి



మృతి చెందిన మారయ్య

చిట్టమూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బయ్యవారికండ్రిగ రోడ్డు వద్ద సోమవారం రాత్రి మోటర్ సైకిల్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో కనుబోయిన మారయ్య(38) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... కుమ్మరిపాళెం గ్రామానికి చెందిన మారయ్య భార్య బిడ్డలతో కలిసి మన్నెమాల గ్రామంలోని అత్తగారి ఇంట్లో నివాసం ఉంటున్నాడు. సోమ వారం మోటార్ సైకిల్‌పై కొత్త గుంటకు వచ్చి మన్నెమాలకు తిరిగి వెళ్తుండగా బయ్యవారికండ్రిగ వద్ద ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మారయ్యను 108 వహనంలో నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చిన్న బలరామయ్య తెలిపారు.

డాక్టర్ రమణయ్యకు ప్రముఖుల నివాళి



డాక్టర్ రమణయ్య కుటుబంస సభ్యులను పరామర్శిస్తున్న డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు

నాయుడుపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ కేవీ రమణయ్యకు పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఆదివారం అనారోగ్యంతో రమణయ్య మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన స్వగ్రామమైన నాయుడుపేట మండలం బిరదవాడలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. నాయుడుపేట డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ గోపినాథ్, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ ఆదవరపు సందీప్, డాక్టర్ క్రాంతికుమార్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ రామసుబ్బయ్య, విశ్రాంత ఉద్యోగుల నాయకులు ఉమాశంకర్, పేర్నాటి వెంకటేశ్వర్లు, చిగురువాడ పద్మనాభం, హెచ్ సుబ్రహ్మణ్యం, కాలేషా, నారాయణ పాఠశాల ఏవో గౌస్‌బాషా, ప్రిన్సిపాల్ మల్లిఖార్జున తదితరులు నివాళులర్పించారు.

డక్కిలి పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శివశంకర్ గౌడ్

డక్కిలి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డక్కిలి పోలీసు స్టేషన్‌లో సోమవారం ఓపెన్‌హౌస్ నిర్వహించారు. పోలీసు స్టేషన్ సందర్శన కోసం వచ్చిన డక్కిలి బాలికల గురుకుల కళాశాల విద్యార్థులకు పోలీసులు వినియోగించే ఆయుధాలు, వాటి పనితీరు గురించి ఎస్‌ఐ శివశంకర్ గౌడ్ వివరించారు. పోలీసుల విధులు, చట్టాలపై అవగాహన కల్పించారు. స్టేషన్‌లో ఫిర్యాదులు స్వీకరించే చాంబర్, లాకప్ రూంను విద్యార్థులు పరిశీలించారు. ఎవరైనా వేధింపులకు పాల్పడినా, ప్రమాదాలు సంభవించినా విద్యార్థులు భయపడకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ సూచించారు.

తడి, పొడి చెత్తతో సంపద



యల్లసిరి గ్రామంలో చెత్త సేకరిస్తున్న అధికారులు

చిట్టమూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): చెత్తతో సంపద సృష్టించేందుకు చర్యలు చపట్టినట్లు ఎంపీడీవో మనోహర్ గౌడ్ తెలి పారు. సోమవారం యల్లసిరి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పారిశుధ్య కార్మికులు చెత్త సేకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడు తూ మండలంలో ఉన్న డంపింగ్ యార్డుల్లో తడి, పొడి చెత్త వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం లో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జనార్దన్, కార్యదర్శి ధనలక్ష్మి పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

కోట మార్చి 3(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులను ఆ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి సోమవారం అభినందించారు. గత నెల 28 నుంచి ఈనెల 1వ తేదీ వరకు నెల్లూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయి క్రీడా పోటీలు జరిగాయి. ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన చందు కబడ్డీ, టేబుల్ టెన్నిస్‌లో ప్రథమ స్థానం, మహిళా విభాగం టేబుల్ టెన్నిస్‌లో చందన ద్వితీయ స్థానం సాధించారు. ఆయా క్రీడాకారులను డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి ,ఫిజికల్ డైరెక్టర్ మల్లికార్జున్ రెడ్డిలు షీల్డ్‌లు, మెమెంటోలతో వారిని అభినందించారు.

స్విమ్స్‌లో కలెక్టరుకు చికిత్స

తిరుపతి(వైద్యం), మార్చి 3(ఆంధ్రజ్యోతి): కిడ్నీలో రాళ్లు ఉండటంతో సోమవారం స్విమ్స్‌లో అడ్మిట్ అయిన కలెక్టరు వెంకటేశ్వర్‌కు వైద్యులు చిన్నపాటి శస్త్ర చికిత్స చేసి, వెంటనే డిశ్చార్జి చేశారు. ఇటీవల ఆయన స్విమ్స్‌లో చేసుకున్న వైద్యపరీక్షల్లో కిడ్నీలో చిన్నపాటి రాళ్లు ఉన్నట్లు తేలింది. దీంతో సోమవారం స్విమ్స్‌లోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో అడ్మిట్ అయ్యారు. ఆయనకు కోత, కుట్లు లేకుండా వైద్యులు చిన్నపాటి సర్జరీని చేశారు. సాయంత్రానికి కోలు కోవడంతో వైద్యులు ఆయన్ను డిశ్చార్జి చేశారు. ప్రస్తుతం ఆయనకు ఎటువంటి ఆరోగ్య ఇబ్బందులు లేవని స్విమ్స్ వైద్యులు తెలిపారు.

ఆప్కాస్‌ను రద్దు చేస్తే ఆందోళన

తిరుపతి(ఆటోనగర్), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర హెచ్చరించారు. ఆప్కాస్ రద్దు చేస్తే 1.20 లక్షల మంది కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదని, ప్రభుత్వ పెద్దలు పునరాలోచించాలని కోరారు.

జనసేన ప్లీనరీకి జనసమీకరణపై చర్చ



ప్రకాష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆరణి

వెంకటగిరి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును వెంకటగిరి జనసేన నాయకుడు జంపాల ప్రకాష్ సోమవారం కలిశారు. ఈనెల 14న పిఠాపురంలో జనసేన పార్టీ ప్లీనరీ సభ నిర్వహించనున్నారు. ఈ సభను విజయవంతం చేసే చేపట్టాల్సిన కార్యాచరణపై వెంకటగిరి నియోజకవర్గ నేతలతో సోమవారం తిరుపతిలో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ఆరణిని కలిసిన ప్రకాష్ నియోజకవర్గంలో జనసేన పరిస్థితిని వివరించారు. జనసేన ప్లీనరీకి వెంకటగిరి నుంచి జన సమీకరణ బాధ్యతను ప్రకాష్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌ను ఎమ్మెల్యే ఆరణి సన్మానించారు.

బంగారు గొలుసు అప్పగింత

తిరుమల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): భక్తులు గదిలో మర్చిపోయిన గొలుసును గుర్తించి అధికారుల ద్వారా తిరిగి భక్తులకు అందజేసి టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి తన నిజాయతీ చాటుకున్నాడు. విజయవాడకు చెందిన జయశ్రీ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చారు. సన్నిధానంలో 5 నెంబరు గదిని అద్దెకు పొందారు. శ్రీవారి దర్శనం అనంతరం సోమవారం గది ఖాళీ చేసే సమయంలో బంగారు గొలుసును మర్చిపోయి వెళ్లిపోయారు. గదిని శుభ్రపరిచేందుకు వెళ్లిన టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి నాగార్జున్ గొలుసును గుర్తించి, టీటీడీ రిసెప్షన్ అధికారులకు అందజేశాడు. గొలుసు పోయిందటూ వచ్చిన భక్తుల నుంచి వివరాలు సేకరించిన రిసెప్షన్ ఓఎస్డీ సత్రేనాయక్, అధికారులు తిరిగి అందజేశారు. అధికారులు, సిబ్బందికి భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. నిజాయతీ చాటిన ఉద్యోగిని రిసెప్షన్ అధికారులు పట్టువస్త్రంతో సత్కరించి అభినందనలు తెలిపారు.

గ్రామీణ యువతకు ఉపాధి శిక్షణ

తిరుపతి(వైద్యం), మార్చి 3(ఆంధ్రజ్యోతి): దీనదయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్యయోజన పథకం కింద గ్రామీణ నిరుద్యోగ యువతకు మూడు నెలల ఉచిత శిక్షణ, నూరు శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఏటూబీ డీడీయూ-జీకేవై స్కిల్స్ అకాడమీ ప్రిన్సిపాల్ కొండ మురళీమోహన్ పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ పదో తరగతి పాసైన 18 నుంచి 30 ఏళ్ల లోపు గ్రామీణ ప్రాంత వాసులు మాత్రమే అర్హులని తెలిపారు. వీరికి కౌంటర్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, రెస్టారెంట్ క్యాపిటల్ కోర్సుల్లో మూడు నెలల ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు 9391810079కు సంప్రదించాలన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు



పరీక్షా కేంద్రంలో విద్యార్థులు

గూడూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ, నారాయణ, స్వరాంధ్ర భారతి, సెయింట్ మేరీస్, ఎస్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉదయం 9నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

పెళ్లకూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ నాగరాజు హెచ్చరించారు. సోమవారం రాత్రి మండలంలోని చెంబేడు గ్రామంలో బెల్ట్ షాపుపై పోలీసులు దాడి చేశారు. 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, బెల్ట్ షాపు నిర్వాహకుడు రమణయ్యను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

అర్జీల స్వీకరణ

వెంకటగిరి టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 8వ వార్డు సచివాయంలో కౌన్సిలర్ ఆరి శంకరయ్య ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు.

అన్నదానం

గూడూరు అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్ర స్వామి ఆలయంలో సోమవారం పూజలు నిర్వహించారు. నారాయణరెడ్డి దాతృత్వంతో అన్నదానం చేశారు.